

# నేటి నిజం

తెలుగు దినపత్రిక




website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 8-12-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి:27 సంచిక:108 పేజీలు:4 వెల: రూ.1/-

## ఏలూరులో పెరుగుతున్న అస్వస్థత కేసులు

# 382మందికి పైగా చేరిక

ఏలూరు,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో అంతు చిక్కని వ్యాధి కలకలం రేపుతోంది. రెండు రోజులుగా ఈ వింత వ్యాధి అందరిని వణుకు పుట్టిస్తోంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా అధిక సంఖ్యలో అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలు కావడంతో నగర ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. రెండు రోజులుగా ఈ వింత వ్యాధి ఏంటో తెలియకపోవడం మరింత కలకలం రేపుతోంది. ఈ అంతు చిక్కని వ్యాధి కారణంగా ఏలూరు జిల్లాల్లోని చుట్టుపక్కల గ్రామాలప్రజలు సైతం తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరుతున్నారు. అయితే రోగులకు ఎలాంటి వ్యాధి లక్షణాలు లేకపోవడంతో వైద్యులకు అర్థం కాని పరిస్థితి నెలకొంది. నీటి సరఫరా పై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ వింత వ్యాధిపై ఇప్పటి వరకు ఎలాంటి క్లారిటీ లేదు. ఇప్పటికే ఈ వింత వ్యాధితో ఆస్పత్రిలో చికిత్స పొందు కోలుకోగా, ఇప్పటి వరకు ఈ వింత వ్యాధి బారిన పడిన వారి సంఖ్య 382కు చేరింది. ఇప్పటి వరకు 187 మంది చికిత్స పొందు కోలుకున్నారు. ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రోగుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లోకి వెళ్లిన వైద్య బృందాలు సైతం రక్త నమూనాలు సేకరిస్తున్నారు. ఫిడ్స్ లక్షణాలతో చేరిన బాధితులకు ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో అదనపు బెడ్‌లను ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం ఆళ్లనాని ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కంట్రోల్ రూమ్ ద్వారా కలెక్టర్, అధికారులకు దిశా నిర్దేశం చేశారు. నిన్న ఉదయం నుంచి క్రమంగా కేసులు తగ్గాయని మంత్రి ఆళ్లనాని తెలిపారు. ఎక్కువగా కేసులు నమోదవుతున్న ప్రాంతాల్లో 108 అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచినట్లు మంత్రి తెలిపారు. సీఎం కార్యాలయం నుంచి గంట గంటకు ఇక్కడి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారని మంత్రి తెలిపారు. నీరు, ఫుడ్ పాయిజన్ లాంటివి ఏవి జరగలేదని తెలుస్తోంది. అయితే విజయవాడ ఎయిమ్స్ నుంచి ప్రత్యేక వైద్య బృందం వచ్చింది. నిపుణుల బృందాలు కూడా ఏలూరుకు రానున్నాయి. ఎక్కువగా కేసులు నమోదైన ప్రాంతాల్లో వాలంటీర్లు సర్వే చేపట్టారు. వైద్య శిబిరాల్లో వారి నుంచి బ్లడ్ శాంపిల్స్‌ను సేకరించి పుణె ల్యాబ్‌కు పంపించారు.

# ఏలూరు బాధితులకు సీఎం వైఎస్ జగన్ పరామర్శ

## బాధితులకు అండగా ఉంటామని హామీ !

ఏలూరు,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో



అంతుచిక్కని వ్యాధితో చాలామంది అల్లాడిపోతున్నారు. అసలు వారికి ఏ వ్యాధి వచ్చిందో కూడా ఇంకా తెలియడంలేదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి .. ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న వారిని పరామర్శించారు.

ఈ సందర్భంగా పలువురు బాధితులతో స్వయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆస్పత్రి బెడ్ పై ఉన్న ఓ బాలుడిని సీఎం జగన్ పరామర్శించగా... అతను రెండు చేతులెత్తి నమస్కరించే ప్రయత్నం చేశాడు. దీంతో బాలుడిని వారించిన జగన్ అతని నదుటిపై ముద్దు పెట్టాడు. బాధితులంతా ధైర్యంగా ఉ



అయినట్లు వైద్యులు వెల్లడించారు.

శనివారం ఏలూరు పట్టణంలోని పడమరవీధితాపీమేస్త్రీ కాలనీశనివారం పేటఆదివారం పేటకొత్తపేటఅరుంధతీ పేట స్థానికులు అస్వస్థతకు గురవగా... ఆదివారం మరికొన్ని కాలనీలకు ఈ వ్యాధి వ్యాప్తి చెందింది. ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిలో ఎవరికి ప్రాణాపాయం లేదని అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. కాసేపట్లో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. కాగా మూర్ఛ కళు తిరగడం నోట్లో నురగ వంటి లక్షణాలతో మరికొంత మంది ఈ రోజు ఆసుపత్రుల్లో చేరారు.

# తుదిదశకు చేరుకున్న స్వదేశీ వ్యాక్సిన్ల ప్రయోగాలు

## ముమ్మరంగా వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్స్

పుణె,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): కరోనా వాక్సిన్ తయారీకి ప్రపంచ వ్యాప్తంగా పలు సంస్థలు కృషి చేస్తున్నాయి. ఇప్పటికే రష్యా తొలి వ్యాక్సిన్ స్పుత్నిక్-వి పేరుతో రిజిష్టర్ చేసింది. ఇక భారత్‌లోనూ వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్స్ ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఆస్ట్రా జెనెకాతో పాటు స్వదేశీ వ్యాక్సిన్ల ప్రయోగాలు తుదిదశకు చేరుకున్నాయి. రష్యాకు చెందిన స్పుత్నిక్-వి వ్యాక్సిన్ ప్రయోగాలు కూడా ముమ్మరం చేసింది. పుణె నగరంలోని నోబెల్ ఆస్పత్రిలో వాటి ప్రయోగాలను ప్రారంభించారు. మూడు రోజులుగా 17 మంది వాలంటీర్లకు కోవిడ్ వ్యాక్సిన్ అందించిన అధికారులు వారి ఆరోగ్యాన్ని ఎప్పటి కప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అయితే ప్రస్తుతం రెండోదశ ప్రయోగాలు జరుగుతున్నాయి. రెండోదశలోనూ వాలంటీర్లకు రెండు డోసుల వ్యాక్సిన్‌ను అందించనున్నారు. భారత్‌లో ఏదైన వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకురావాలంటే.. వ్యాక్సిన్‌కు సంబంధించి రెండు, మూడో దశ ప్రయోగాలను ఇక్కడ కూడా నిర్వహించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్‌తోపాటు స్పుత్నిక్-వి క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తోంది. రష్యా తయారు చేసిన స్పుత్నిక్-వి వ్యాక్సిన్ భారత్‌లో సరఫరా చేసేందుకు డాక్టర్ రెడ్డీస్ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రయోగాల తర్వాత పది కోట్ల డోసులను భారత్‌లో సరఫరా చేసేందుకు ఆర్డీఐఎస్‌తో డాక్టర్ రెడ్డీస్ ఒప్పందం కుదుర్చుకుంది. మరోసంస్థ హెటెరోతోనూ ఏటా పది కోట్ల డోసుల ఉత్పత్తికి స్పుత్నిక్ ఒప్పందం చేసుకుంది. రష్యాలో ఇప్పటికే వేలమందిపై ప్రయోగించారు. క్లినికల్ ట్రయల్స్ ఫలితాల విశ్లేషణలో వ్యాక్సిన్ దాదాపు 92 శాతానికిపైగా సమర్థత కలిగినట్లు రష్యా ఆరోగ్యశాఖ వెల్లడించింది.

# అన్ని ఓట్లు లెక్కించాల్సిందే

## నేరేడ్‌మెట్ కార్పొరేటర్ ఎన్నికపై హైకోర్టు తీర్పు
## నేరేడ్‌మెట్ డివిజన్ ఫలితం వెల్లడికి తొలిగిన అడ్డంకి

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలకు సంబంధించి నేరేడ్‌మెట్ డివిజన్‌లో ఏర్పడిన సందిగ్ధంపై హైకోర్టు తీర్పు వెలువరించింది. అన్ని ఓట్లను లెక్కించాలని స్పష్టం చేసింది. బ్యాలెట్ మీద స్వస్తిక్ ముద్రతో పాటు ఇతర ముద్ర (పెన్ను టిక్ మార్క్, సున్నా చుట్టడం, టిక్ పెట్టడం) ఉన్న 544 ఓట్లను కూడా లెక్కించాలని హైకోర్టు ఆదేశించింది. మొత్తం కలిపి రీ కౌంటింగ్ చేయాలని హైకోర్టు తీర్పు చెప్పింది. దీంతో ప్రస్తుతం కౌంటింగ్ కోసం పెండింగ్‌లో ఉన్న ఒక బాక్సును కూడా ఓపెన్ చేసి ఓట్లను లెక్కించనున్నారు ఎన్నికల సంఘం అధికారులు. డిసెంబర్ 1న జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికలకు సంబంధించి డిసెంబర్ 4న కౌంటింగ్ జరిగింది. ఆ కౌంటింగ్‌కు కొన్ని గంటల ముందు రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక సర్క్యులర్ జారీ చేసింది. ఆ ఆదేశాల ప్రకారం బ్యాలెట్ పత్రాల మీద స్వస్తిక్ గుర్తుతో పాటు ఇతరత్రా గుర్తులు పెన్నుతో టిక్ పెట్టి ఉన్నా, చుక్క పెట్టి ఉన్నా కూడా దాన్ని ఓటుగా గుర్తించాలంటూ ఎస్ఈసీ ఆదేశాలు ఇచ్చింది. దీన్ని బీజేపీ తప్పుపడుతూ కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం సర్క్యులర్‌ను సస్పెండ్ చేసింది. తుది తీర్పునకు లోబడి ఫలితాలు ఉండాలని చెప్పింది. అయితే, ఎన్నికలకు సంబంధించి ఈసీ విధుల్లో కోర్టుల జోక్యం చేసుకోవడానికి వీల్లేదంటూ ఎస్ఈసీ మరోసారి హైకోర్టు దృష్టికి తీసుకెళ్లింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం స్వస్తిక్ గుర్తులతో పాటు ఇతర గుర్తులు ఉన్నా కూడా వాటిని ఓటుగా గుర్తించాలని స్పష్టం చేసింది.

# భారత్ బంద్‌కు దేశవ్యాప్త మద్దతు !

## రైతన్నకు ప్రతిపక్ష్యాల అనూహ్య మద్దతు
## గళంవిప్పిన అన్ని యూనియన్లు
## ఇప్పటికే కేంద్రం మూడు సార్లు చర్చలు

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): రైతు సంఘాలు చేపట్టనున్న భారత్ బంద్‌కు దేశవ్యాప్తంగా అనూహ్య స్థాయిలో మద్దతు పెరుగుతోంది. ప్రభుత్వంతో ఇప్పటికే మూడు సార్లు చర్చలు జరపగా ఆశించిన ఫలితాన్నివ్వకపోవడంతో మంగళవారంనాడు భారత్ బంద్‌కు రైతులు పిలుపునిచ్చారు.

ఈ బంద్‌కి విపక్షాలన్నీ తమ మద్దతు ప్రకటించాయి. లారీల యజమానులు పది ప్రధాన కార్మిక సంఘాలు అనేక ఇతర యూనియన్లు మద్దతు పలకగా బ్యాంకు యూనియన్లు కూడా తమ గళం కలిపాయి. అటు బాలీవుడ్ తారలు ప్రియాంక చోప్రా సోనమ్ కపూర్ లతో పాటు పంజాబ్ నుంచి ఎన్నికైన సన్నీ డియోల్ కూడా మద్దతిచ్చారు. కేంద్రం తీసుకొచ్చిన మూడు రైతు చట్టాలని వెనక్కి తీసుకోవాలని దాదాపు 10 రోజులుగా ఢిల్లీ-హర్యానా సరిహద్దుల్లో వంటా వార్పు లాంటి కార్యక్రమాలతో వేలాదిమంది రైతులు ఢిల్లీని ముట్టడించారు. ఆ ఆందోళనలు అలాగే కొనసాగుతున్నాయి. రైతులు ప్రకటించిన భారత్ బంద్‌కి ఎన్డీయేతర పార్టీలు అయిన కాంగ్రెస్ శివసేన టీఆర్ఎస్ ఆర్జేడీ లాంటి పార్టీలు కూడా మద్దతు ప్రకటించాయి. విపక్షాలన్నీ బంద్‌కు తమ మద్దతు ప్రకటించాయి. లారీల యజమానులు పది ప్రధాన కార్మిక సంఘాలు అనేక ఇతర యూనియన్లు మద్దతు పలకగా బ్యాంకు యూనియన్లు కూడా తమ గళం కలిపాయి. అటు బాలీవుడ్ తారలు ప్రియాంక చోప్రా సోనమ్ కపూర్లతో పాటు పంజాబ్ నుంచి ఎన్నికైన సన్నీ డియోల్ కూడా మద్దతిచ్చారు.

చట్టాల్ని రద్దు చేయకుంటే ప్రభుత్వం తనకు ఇచ్చిన అత్యున్నత క్రీడా పురస్కారం రాజీవ్ ఖేల్ రత్నను వాపస్ ఇచ్చేస్తానని బాక్సర్ విజేందర్ సింగ్ ప్రకటించారు. పరిస్థితిపై నేడు కేంద్ర వ్యవసాయ హోం శాఖలు చర్చలు జరపనున్నాయి. రైతులతో మాత్రమే మొదలైన ఈ ఉద్యమం ఇపుడు ఎన్డీయేతర పార్టీలు కార్మిక సంఘాలు బ్యాంకు ఉద్యోగుల సంఘాలతో పాటు ఎన్డీయేతర ప్రభుత్వాల మద్దతు కూడగట్టేదాకా చేరుకుంది. రాజకీయ పార్టీలతో పాటు కార్మిక సంఘాలు కూడా బంద్‌కు మద్దతు ప్రకటించిన నేపథ్యలో ఆ రోజు సాధారణ జన జీవనానికి తీవ్ర విఘాతం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా బ్యాంకింగ్ రవాణా సేవలు స్తంభించి పోయే అవకాశం ఉంది.

# ప్రతీ జిల్లాలో పీవీ కాంస్య విగ్రహం

ఖమ్మం,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వానికి నిబద్ధత, చిత్తశుద్ధి ఉంటే మాజీ ప్రధానికి భారతరత్న ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం జిల్లాలో ఇతర మంత్రులతో కలిసి పర్యటించిన కేటీఆర్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా లకారం ట్యాంక్‌బ్యాండ్‌పై మాజీ ప్రధాని పీవీ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. రూ.1.25 కోట్లతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధానికి భారతరత్న ఇవ్వాలని రాష్ట్ర ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారన్నారు. పీవీకి భారతరత్న ఇవ్వడమంటే కేంద్రం తనను తాను గౌరవించుకున్నట్లే అవుతుందని కేటీఆర్ వివరించారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి పీవీ పేరు పెట్టాలని కేంద్రాన్ని కోరినట్లు ఆయన గుర్తు చేశారు. కేటీఆర్‌తో సహా పలువురు మంత్రులు పీవీ పేరు మీద శత జయంతి సంకలనం పుస్తకావిష్కరణ చేశారు.



## కేంద్ర ప్రభుత్వానికి నిబద్ధత, చిత్తశుద్ధి లేదు
## మాజీ ప్రధానికి భారతరత్న ప్రకటించాలి
## ఐటీ శాఖ మంత్రి కేటీఆర్

# తమ ఉనికి కోసం రాజకీయ పార్టీలు తాపత్రయపడుతున్నాయి

## కాంగ్రెస్ గతాన్ని మరిచి ప్రవర్తిస్తోంది
## మార్కెట్ కమిటీ చట్టాన్ని రద్దు చేస్తామని 2019 మేనిఫెస్టోలో కాంగ్రెస్ పేర్కొంది
## ప్రతిపక్షాల వైఖరిని తీవ్రంగా ఆక్షేపించిన కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): నూతన చట్టాల విషయంలో ప్రతిపక్షాలు అనుసరిస్తున్న వైఖరిని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ తీవ్రంగా ఆక్షేపించారు. వ్యవసాయ రంగంలో సంస్కరణల కోసం ప్రధాని మోదీ ఏదైతే చేశారో... దానినే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు మాత్రం పార్టీలు ఈ బిల్లులను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. ఆయా పార్టీలు ఎన్నికల్లో ఓడిపోతున్నాయని, అందుకే తమ రాజకీయ ఉనికి కోసం తాపత్రయపడుతూ నిరసనల్లో పాలుపంచుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నాయి కాబట్టి నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. మార్కెట్ కమిటీ చట్టాన్ని రద్దు చేస్తామని 2019 మేనిఫెస్టోలో కాంగ్రెస్ పేర్కొందని, అంతేకాకుండా వ్యవసాయ ఉత్పత్తులపై ఉన్న ఎగుమతుల ఆంక్షలను ఎత్తేస్తామని కూడా పేర్కొందని ఆయన గుర్తు చేశారు. ఈ గతాన్ని కాంగ్రెస్ మరిచిపోయి ప్రవర్తిస్తోందని ఆయన మండిపడ్డారు. నూతన చట్టాలను ఎన్సీపీ అధినేత శరద్ పవార్ కూడా వ్యతిరేకిస్తున్నారని, కానీ ఆయన వ్యవసాయ మంత్రిగా ఉన్న సమయంలో మార్కెట్‌లలో మౌలిక సదుపాయాల నిమిత్తం ప్రైవేట్ రంగాన్ని కూడా చేర్చాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు లేఖలు కూడా రాశారని రవిశంకర్ గుర్తు చేశారు. తాము నిరసన వ్యక్తం చేసే వేదికలపైకి రాజకీయ నేతలెవ్వరూ రావొద్దని రైతు సంఘాల నేతలు పేర్కొన్నారని, వారి భావాలను తాము గౌరవిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కానీ నరేంద్ర మోదీని, బీజేపీని విమర్శించడానికి ఓ వేదిక దొరికింది కాబట్టే... ఈ పోరాటంలో వివిధ పక్షాల నేతలు కూడా వస్తున్నారని ఆయన విమర్శించారు. తమ రాజకీయ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిన సమయంలో నిరసన ప్రదర్శనల్లో పాల్గొనడం కాంగ్రెస్, ఎన్సీపీకి అలవాటైన ప్రక్రియ అని రవిశంకర్ ప్రసాద్ మండిపడ్డారు.

# ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురైన ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిలింనగర్‌లోని వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటున్న గుంటి సాయికృప(17) ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్నది. తండ్రి బాలరాజు ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా తల్లి హేమలత స్థానికంగా అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తున్నది. గత కొన్ని రోజులుగా తనకు కడుపునొప్పి లేస్తోందంటూ తల్లిదండ్రులకు సాయికృప చెబుతోంది. దవాఖానకు వెళ్దామని చెప్పినా తనకు భయం అంటూ వెనక్కి తగ్గేది. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం కూడా మరోసారి కడుపునొప్పి వస్తోందంటూ సాయికృప తండ్రి బాలరాజుకు చెప్పింది. దీంతో ఆగ్రహానికి గురయిన తండ్రి 'కడుపునొప్పి వస్తుందంటూ చెప్పి దవాఖానకు వెళ్దామంటే రావంటూ..' మందలించాడు. కడుపునొప్పి అంటూ తనను విసిగించవద్దని కసురుకున్నాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన సాయికృప తన గదిలోకి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎంతసేపటికి గదిలోంచి కూతురు రాకపోవడంతో తల్లి హేమలత అక్కడకు వెళ్లి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకున్న కూతురు కనిపించింది. స్థానికుల సహకారంతో ఆమెను కిందకు దింపి అపోలో దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులకు తండ్రి బాలరాజు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఇక టోల్ చెల్లింపులు నగదురహితం

## జనవరి1నుంచి టోల్ ప్లాజా వద్ద కొత్త నిబంధన అమలులోకి తెచ్చేందుకు కేంద్ర సర్కారు సిద్ధం

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): జనవరి 2021నుంచి జాతీయ రహదారులపై జరిగే టోల్ చెల్లింపులను నగదురహితం చేసేందుకు కేంద్ర సర్కారు సిద్ధమైంది. జనవరి 1నుంచి టోల్ గేట్ల వద్ద 100 శాతం వసూళ్లను ఫాస్టాగ్ ద్వారా నిర్వహించేలా చర్యలకు ఉపక్రమించింది. ప్రస్తుతం టోల్ చెల్లింపుల్లో దాదాపు 75 శాతం ఫాస్టాగ్స్ ద్వారా జరుగుతున్నాయి. ప్రస్తుతం ఒక లైన్‌లో మాత్రమే నగదు రూపంలో చెల్లింపులకు అనుమతి ఉంది.

నూతన సంవత్సరం నుంచి వంద శాతం ఫాస్టాగ్ ఉండే అవకాశ ముంది. అంటే నగదు తీసుకునే అవకాశం లేదు. కాబట్టి వాహనదారులు ముందే జాగ్రత్తపడటం మంచిది. నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్ హెచ్ఏఐ) ప్రకారం స్మార్ట్ ట్యాగ్స్‌ను త్వరగా జారీ చేయడానికి, వాటిని రీఛార్జ్ చేయ డానికి వీలుగా సిబ్బందిని నియమించుకుంటున్నారు. కొందరు నగదు రూపంలో చేసే చెల్లింపులు టోల్ ప్లాజాల వద్ద సాఫీగా జరిగే ప్రయాణంపై ప్రభావం చూపుతున్నాయని, ఈ నేపథ్యంలో నగదురహిత చెల్లింపుల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉందని చెబుతున్నారు. ఫోర్ వీలర్స్, అంతకంటే పెద్ద వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ రెన్యూవల్ చేయాలన్నా, జనవరి 1వ తేదీ నుంచి, థర్డ్ పార్టీ బీమా రెన్యూవల్‌కు ఏప్రిల్ 1వ తేదీ నుండి ఫాస్టాగ్ తప్పనిసరి. ఈ మేరకు రోడ్డు, రవాణా మంత్రిత్వ శాఖ నిబంధనలు తీసుకు వచ్చాయి. టోల్ గేట్ల వద్ద ట్రాఫిక్ నియంత్రించే లక్ష్యంతో కేంద్రం 2017లో ఫాస్టాగ్ విధానాన్ని తెచ్చింది. ఫాస్టాగ్ కలెక్షన్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. అక్టోబర్ నెలలో ఏకంగా రూ.702.86 కోట్ల డిజిటల్ టోల్ కలెక్షన్లు నమోదయ్యాయి. సెప్టెంబర్ నెలలో రూ.658.94 కోట్లుగా ఉంది. నవంబర్ కలెక్షన్లు అంతకు మించి ఉండే అవకాశం ఉంది.

## చరిత్రలో నేటినిజం



కం॥ హీరోల్లోగా హీ-మ్యానుగ
పేరెన్నిక గన్న ఘనుని ప్రియతమ మెంతున్
తారల 'హేమ'కు విభునిగ
తారలలో చంద్రుడైన 'ధర్మేంద్ర' ఘనాన్!!

(డిసెంబర్ 8 హీరో ధర్మేంద్ర జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210



# రైతుల ఆందోళనకు 16 రాజకీయ పార్టీల మద్దతు

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): బడా కార్పొరేట్ కంపెనీల, అగ్రి బిజినెస్ సంస్థల ప్రయోజనాల కోసం రైతులను నాశనం చేసేందుకు మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని కోరుతూ రైతు సంఘాలు ఇచ్చిన భారత్ బంద్ పిలుపునకు అన్ని వైపుల నుంచి అపూర్వమైన సంఘీభావం వ్యక్తమవుతున్నది. ఈ నెల 8న జరపతలపెట్టిన ఈ భారత్ బంద్‌కు 16 రాజకీయ పార్టీలు, 51 ట్రాన్స్‌పోర్టు యూనియన్లు మద్దతు తెలిపాయి. వివిధ పార్టీల నేతలు సోనియా గాంధీ (కాంగ్రెస్), ఎంకె స్టాలిన్ (డిఎంకె), శరద్ పవార్ (ఎన్‌సిపి), తేజస్వి యాదవ్ (ఆర్‌జెడి), ఫరూక్ అబ్దుల్లా (పిఎజిడి), అఖిలేష్ యాదవ్ (ఎస్‌పి), సీతారాం ఏచూరి (సిపిఎం), డి రాజా (సిపిఐ), దీపాంకర్ భట్టాచార్య సిపిఐ (ఎంఎల్), దేబబ్రత విశ్వాస్ (ఫార్వర్డ్ బ్లాక్), మనోజ్ భట్టాచార్య (ఆర్ఎస్‌పి) ఆదివారం నాడిక్కడ ఈ మేరకు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రైతు పోరాటానికి తమ పూర్తి సంఘీభావం తెలియజేస్తున్నట్లు వారు ఆ ప్రకటనలో తెలిపారు. రైతులు పండించే పంటకు కనీస మద్దతు ధరను రద్దు చేయడానికి కొత్త చట్టాలను తీసుకొచ్చారని విమర్శించారు.

# లండన్‌కు తాకిన రైతు ఆందోళన సెగ

## మద్దతుగా బ్రిటన్‌లో భారతీయుల నిరసన!
## భారత హైకమిషన్ కార్యాలయం ముట్టడి !

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకు వచ్చిన 3 నూతన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఆందోళన కొనసాగుతోంది. ఈ చట్టాలను అడ్డుపెట్టుకుని కార్పొరేట్ సంస్థలు వ్యవసాయంపై గుత్తాధిపత్యం సాధిస్తాయని అప్పుడు తాము దోపిడికి గురవుతామని రైతుల భయంతో ఆ చట్టాలని వెనక్కి తీసుకోవాలని ఆందోళన చేస్తున్నాయి. ఈ రైతుల ఆందోళనకి విదేశాల్లో కూడా మద్దతు పెరుగుతోంది.

రైతాంగ నిరసనల ఉద్యమం లండన్ వరకూ పాకింది.

ఇప్పటికే కెనడా తన గళాన్ని వినిపించింది. ఆ దేశ ప్రధానమంత్రి జస్టిన్ ట్రుడో స్వయంగా.. రైతన్నలకు అండగా నిలిచారు. ఈ సారి బ్రిటన్ లో నివసిస్తోన్న ప్రవాస భారతీయులు నిరసన బాట చేపట్టారు. వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా వేలాదిమంది నిరసన చేపట్టారు. భారత హైకమిషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. అయితే కరోనా నియమాలు అమలులో ఉండటంతో లండన్ పోలీసులు పలువురిని అరెస్టు చేశారు. మూడు వ్యవసాయ బిల్లులకు నిరసనగా లండన్లోని సిక్కులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. వేలాదిమంది రోడ్ల మీదికి వచ్చారు. ప్లకార్డులను ప్రదర్శిస్తూ తమ నిరసన తెలిపారు. పంజాబ్ రైతులకు తాము మద్దతు ఇస్తున్నామంటూ నినదించారు. కార్లు బైకులు ఇతర వాహనాల ద్వారా వారంతా నిరసన ప్రదర్శనలను చేపట్టారు. లండన్‌లోని ఆల్డ్ విచ్ ప్రాంతంలో ఉన్న భారత హైకమిషన్ కార్యాలయానికి ర్యాలీగా తరలి వెళ్లారు. ఇండియన్ ఓవర్ సీస్ కాంగ్రెస్ ఈ నిరసన ప్రదర్శనలకు సారథ్యాన్ని వహించింది. అనంతరం భారత హైకమిషన్ కార్యాలయం వద్ద బైఠాయించడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. లండన్ సహా బ్రిటన్ వ్యాప్తంగా కరోనా వైరస్ వ్యాప్తి చెందడాన్ని నివారించడానికి ఉద్దేశించిన నిబంధనలు మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయి. ఈ నిబంధనల ప్రకారం మాస్కులు ధరించడం భౌతిక దూరాన్ని పాటించడం తప్పనిసరి. నిరసన ప్రదర్శనలపై నిషేధం విధించారు. కోవిడ్ మార్గదర్శకాలను ఉల్లంఘించిన కారణంగా లండన్ పోలీసులు పలువురిని అరెస్టు చేశారు.

# తమిళనాట తలైవా వెనక బిజెపి ?

నేటినిజం
మంగళవారం 8-12-2020

తమిళనాట రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తలైవా ఏ మేరకు ప్రభావం చూపుతారన్నది పక్కన పెడితే తమిళనాట పాగాకు బిజెపి రజనీని ఉపయోగించుకుంటుందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఆయన పార్టీ ప్రకటన చేయగానే సిఎం పళనిస్వామి మద్దతు పలకడం వెనక ఆంతర్యం ఏమై ఉంటుందా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. మరోవైపు రజనీతో పొత్తుకు సిద్ధం అని కూడాప్రకటించారు. దక్షిణాదిన పాగా వేయాలనుకుంటున్న బిజెపి ఆయా రాష్ట్రాల్లో ఉన్న పరిస్థితులను తనకు అనుకూలంగా మార్చు కుంటోంది. తెలంగాణలో పాగాకు భరోసా వచ్చిందన్న తీరులో ఉంది. ఎపిలోనూ వ్యూహాలు పన్నుతోంది. తిరుపతి ఉప ఎన్నిక ద్వారా అక్కడ సత్తా చాటేందుకు రంగం సిద్ధం చేసుకుంటోంది. ఈ క్రమంలో ఇప్పుడు తమళనాడు రాజకీయాలను గుప్పిట్లో పెట్టుకునేందుకు యత్నాలు మొదలు పెట్టిందని ఇప్పటికే రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. తన కొత్త పార్టీ వివరాలు డిసెంబర్ 31న వెల్లడిస్తానని రజనీకాంత్ పేర్కొన్నాడు. ఇక డిసెంబర్ 12న రజనీకాంత్ పుట్టినరోజు. ఆ రోజునే రజనీకాంత్ కొన్ని కీలక నిర్ణయాలనూ ప్రకటించనున్నాడని సమాచారం. రజనీకాంత్ జనవరిలో పార్టీ నెలకొల్పినా, తరువాత నాలుగు నెలల్లోనే జరగనున్న ఎన్నికల్లో పోటీ చేయడం అంత సులువేమీ కాదు. అయితే రజనీకాంత్ కు కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ అండదండలు ఉన్నాయని, అందువల్లే ఆయన జనవరిలో పార్టీ పెట్టినా, ఆయన పార్టీ ప్రచారానికి తగిన సహాయసహకారాలు ఆ జాతీయ పార్టీ నుండి పుష్కలంగా లభిస్తాయని కొందరి మాట. దీంతో రజనీకాంత్ పార్టీ ప్రకటించిన తరువాత ఎక్కువగా శ్రమించకుండానే జాతీయ పార్టీ ప్రోత్సాహంతో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోగలడని పరిశీలకులు చెబుతున్నారు. తమిళనాట ఎమ్జిఆర్ తరువాత ఆ స్థాయిలో జనాదరణ ఉన్న నటునిగా రజనీకాంత్ కు పేరుంది. తమిళ సూపర్ స్టార్ గా, తలైవాగా జేజేలు అందుకుంటున్న రజనీకాంత్ తన చిత్రాల ద్వారా ఎన్నోమార్లు తమిళనాడు రాజకీయ పరిస్థితులపై వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. 'బాబా' సినిమా సమయంలో తాను రాజకీయాల్లోకి వస్తున్నట్టు కూడా సినిమాలోనే చూపించాడు. అయితే ఆ సినిమా ఘోర పరాజయం పాలు కావడంతో రజనీ తన రాజకీయ ప్రవేశాన్ని వాయిదా వేసుకుంటూ వచ్చాడు. ఇక అనేక విషయాల్లో కమల్ హాసన్, శివాజీగణెళిశన్ ను అనుసరిస్తూ వస్తున్నాడు. శివాజీగణెళిశన్ లాగా విలక్షణమైన పాత్రలు పోషించి, జనాన్ని ఆకట్టుకున్నాడు కమల్. శివాజీలాగే తమిళనాట అధికారంలో ఉన్న పార్టీలపై కమల్ కూడా కారాలు మిరియాలు నూరాడు. ఆ నేపథ్యంలోనే కమల్ హాసన్ 'విశ్వరూపం' చిత్రం జయలలిత కోపాగ్నికి గురై తమిళనాడులో విడుదలకు నోచుకోలేకపోయింది. దాంతో ఆ సినిమాను ముందుగా తెలుగులో విడుదల చేశాకే, ఆ తరువాత స్వరాష్ట్రంలో రిలీజ్ చేయగలిగాడు. అప్పటి నుంచీ తమిళ రాజకీయాలపై నిశిత దృష్టి సారించిన కమల్ చివరకు సొంతగా 'మక్కల్ నీది మయమ్' పార్టీని నెలకొల్పాడు. రజనీకాంత్ మాత్రం ఆచితూచి అడుగులు వేస్తూ ఇన్నాళ్ళకు రాజకీయాల్లోకి వస్తున్నట్టు ప్రకటి ంచాడు. దీంతో రాబోయే ఎన్నికల్లో ఈ స్టార్స్ ఇద్దరి మధ్య పోరు తప్పదనీ తెలుస్తోంది. మొత్తంగా తమిళనాట రాజకీయ సమరం రంజుగా ఉండబోతోందన్న వాదన వస్తోంది. తలైవా రజనీకాంత్ ఈ సారి ఎలాంటి తడబాటు లేకుండా పొలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇస్తానంటున్నాడు. ఇప్పటికే ఉలగనాయగన్ కమల్ హాసన్ కదనానికి కాలుదువ్వుతున్నాడు. ఈ ఇద్దరు స్టార్స్ రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల బరిలో ఏ తీరున సాగనున్నారు?...ప్రస్తుతం తమిళనాట అందరిలోనే అదే ప్రశ్న నెలకొంది. మొత్తానికి తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. జనవరిలో పొలిటిక్స్ లోకి ఎంట్రీ ఇస్తున్నానంటూ తలైవా ట్వీట్ చేయడంతో హీట్ పెరిగింది. తమిళనాట మరో ఐదు నెలల్లో రాజకీయ వాతావరణం వేడెక్కనుంది. వచ్చే మే నెలలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రజనీ నోట పార్టీ మాట రాగానే ఆయన అభిమానులు పరవశించి పోతున్నారు. ఇప్పటికే మరో తమిళ స్టార్ హీరో కమల్ హాసన్ 'మక్కల్ నీది మయమ్' పార్టీ స్థాపించేశాడు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి పరాజయాన్ని చవిచూసింది కమల్ పార్టీ. అయితే అప్పట్లో ఆయన పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కానీ, ఇప్పుడు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సై అంటున్నాడు. అంతే కాదు మొన్న నవంబర్ 7న తన పుట్టినరోజు సందర్భంగా ఈ సారి పొలిటిక్స్ లో సక్సెస్ సాధించి ఉత్సవాలు చేసుకుందామని అభిమానుల్లో ఉత్సాహం నింపాడు కమల్. దాంతో రజనీ కొత్త పార్టీ, కమల్ 'మక్కల్ నీది మయమ్'పార్టీ పై తమిళ తంబీల్లోనే కాదు పొరుగు రాష్టాల్లోన్రూ ఆసక్తి నెలకొంది. కమల్ హాసన్ తాను నటిస్తున్న చిత్రాలను త్వరిత గతిన పూర్తి చేసి, జనవరి నుండి తానూ రాజకీయ ప్రచారంలో పాలుపంచు కోవడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడని తెలుస్తోంది. అంటే రజనీకాంత్ పార్టీ ప్రకటించిన సమయంలోనే కమల్ హాసన్ తన రాజకీయ వ్యూహాలకు మరింత పదను పెట్టనున్నట్టు వినికిడి. రజనీకాంత్, కమల్ హాసన్ రాజకీయం చూస్తోంటే ఒకప్పుడు తమిళనాట టాప్ స్టార్స్ గా వెలుగొంది, రాజకీయాల్లోనూ పోటీపడ్డ ఎమ్.జి.రామచంద్రన్, శివాజీగణెళిశన్ గుర్తుకు వస్తున్నారని తమిళ సినీజనం అంటున్నారు. ఎమ్జిఆర్ 'అన్నా డిఎమ్.కె. పార్టీ' నెలకొల్పిన తరువాత నుంచీ ఆయన మరణించే వరకు తనకు అనువైన రాజకీయవ్యూహ రచనతో ముందుకు సాగాడు. అదే సమయంలో శివాజీగణెళిశన్ కాంగ్రెస్ పార్టీ దక్షిణాది అధ్యక్షునిగా ఉన్నారు. సౌత్ లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం శివాజీ కృషి చేశారు. అయితే స్వరాష్ట్రంలో ఎమ్జిఆర్ ప్రభంజనాన్ని ఆయన ఎదుర్కోలేకపోయాడు. ఎమ్జిఆర్ ఓ సారి బర్తరఫ్ కావడంతో ఆ తరువాత నుంచీ కేంద్రంలోని పార్టీలతో సఖ్యతగా ఉంటూ తుదిశ్వాస విడిచే దాకా ముఖ్యమంత్రి పీఠంపైనే ఉన్నాడు. ఎమ్జిఆర్ మరణించగానే శివాజీ గణెళిశన్ సొంతగా 'తమిళగ మున్నేట్ర మున్నాని' పార్టీని నెలకొల్పి, 1988 ఎన్నికల్లో శాసనసభకు పోటీ చేశాడు. అయితే ఆ పార్టీ ఒక్క సీటునూ చేజిక్కించుకోలేకపోగా, శివాజీ కూడా గెలవలేక పోవడం గమనార్హం. ఇప్పటికీ ఒకరికొకరు సాయం చేసుకొనే అనుబంధం ఉంది. అందువల్ల రాబోయే ఎన్నికల్లో వీరిద్దరూ కలసి రాజకీయ రంగంలో ముందుకు సాగుతారా? అనే సందేహాలు కూడా జనాల్లో కలుగుతున్నాయి. బీజేపీ మద్దతుతోనే రజనీ రాజకీయప్రవేశం ఉందంటున్నారు పరిశీలకులు. ఆ జాతీయ పార్టీని వ్యతిరేకించడంలో ముందున్న కమల్, మరి రజనీతో చేయి కలుపుతాడా అన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. మరి రాబోయే తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో రజనీకాంత్, కమల్ హాసన్ పార్టీలు ఏ తీరున సాగుతాయో చూడాలి

## రష్యాలో విజృంభించిన కరోనా

### వేల సంఖ్యలో కేసులు నమోదు
### గత 24 గంటల్లో 28,142 కేసులు

మాస్కో,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): కరోనా ప్రపంచాన్ని కబలిస్తోంది. రోజురోజుకు వేల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. అయితే కరోనా మొదటి విడతగా ఉన్నప్పుడే ప్రపంచదేశాలు దీనికి వ్యక్సిన్ కనిపెట్టేందుకు కొన్ని వేల కోట్లను ఖర్చు పెడుతున్నాయి. అయితే రష్యా కరోనాకు వ్యాక్సిన్ కనుగొన్నమాని చెప్పడమే కాకుండా దేశ అధక్షుడు పుతిన్ కూడా వ్యాక్సిన్ ఇంజక్షన్ చేయించుకున్నాడు. కానీ రష్యాలో కరోనా విజృంభన ఇసుమంత కూడా తగ్గలేదు. ఇటీవల వరుసగా ఒకరోజు కేసులను మరోక రోజు దాటుతూ దేశంలో రికార్డులను సృష్టించింది. అయితే గత 24 గంటల్లో రాష్యాలో 28,142 కేసులు నమోదయ్యాయి. వాటితో ఇప్పటి వరకూ దేశంలో నమోదయిన కేసుల సంఖ్య 2,488,912కు చేరాయని దేశంలోని ఫెడరల్ సెంటర్ తెలిపింది. 'గత 24గంటల్లో రష్యాలోని మొత్తం 85 రాష్ట్రాల్లో 28,142 కరోనా కేసులు నమోదయ్యాయి. దేశ రాజధాని మాస్కోలో 20.6 శాతం అంటే 5,789 కేసులు నమోయ్యియి. అందులో కొందరికి ఎటువంటి లక్షణాలు ఉండటం లేద'ని అధికారులు తెలిపారు. దేశ రాజధానిలో 7,279కరోనా కేసులు నమోదవగా, సెయింట్ పీటర్స్‌బర్గ 3,741 కేసులతో మాస్కోను అనుసరిస్తోంది. గత 24 గంటల్లో 456 మరణాలతో ఇప్పటికి దేశంలోని మరణాల సంఖ్య 43,597కు చేరింది. అదేవిధంగా 18,850 మంది కోలుకున్నారు. దీంతో మొత్తం కోలుకున్నావారి సంఖ్య 1,956,588కు చేరింది. ప్రజలను అన్ని వేలలా అప్రమత్తంగా ఉండమని దేశ ప్రభుత్వం కోరింది. తప్పకుండా మాస్క్ ధరించాలని, సామాజిక దూరాన్ని పాటించాలని హెచ్చరించింది.

## ఎన్నికల్లో అసలైన విజేతను నేనే

### ట్రంప్ మళ్లీ అదే బాట

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ):?డొనాల్డ్ ట్రంప్ .. ఈ మద్యే జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్ చేతిలో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అయితే ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్ మాత్రం ఆ ఎన్నికల్లో ఓడిపోయినా నేనే గెలిచాను నేను ఓడిపోలేదు అంటూ నానా రచ్చ చేస్తున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో స్పష్టమైన తీర్పు వచ్చిన తర్వాత ట్రంప్ లా ఫలితాలపై ఆరోపణలు చేసిన అమెరికా మాజీ అధ్యక్షులు ఎవరూ లేరు. తాజాగా మరోసారి ట్రంప్ మళ్లీ అదే మాట మాట్లాడుతున్నాడు. ఎన్నికల్లో తానే అసలైన విజేతని మళ్లీ ప్రకటించుకున్నారు. పూర్తి స్థాయిలో రిగ్గింగ్ జరిగిన ఈ ఎన్నికల్లో మోసం చేసి మరీ బైడెన్ అధ్యక్ష పీఠం దక్కించుకున్నారని ఆరోపణలు చేశాడు. డెమొక్రాట్లు మోసం చేశారు. అధ్యక్ష ఎన్నికల్లో రిగ్గింగ్కి పాల్పడ్డారు. అలా రిగ్గింగ్ చేసిన ఎన్నికల్లో బైడెన్ విజేతగా నిలిస్తే నేను ఓడిపోయాను అని అన్నారు. జనవరి 5న జరగనున్న స్పెషల్ సెనేట్ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థుల తరఫున శనివారం జార్జియాలో ప్రచారం చేసిన ట్రంప్ ఈ ఎన్నికల్లో కూడా అవకతవకలు జరుగుతాయని జోస్యం చెప్పారు. నేను నిజంగా ఓడిపోయి ఉంటే ఆ పరాజయం చాలా గొప్పగా ఉండేది. అప్పుడు నేనే ఓడిపోయానని చెప్పుకొని నా ఇంటికి వెళ్లిపోయేవాడిని అని పేర్కొన్నారు. బైడెన్ విజయం సాధించిన తర్వాత డోనాల్డ్ ట్రంప్ ప్రజల మధ్యన మాట్లాడడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

## ప్రజల ఆకాంక్షలపై దృష్టి సారించాలి

### నిరుద్యోగ సమస్యపై మనసు పెట్టాలి
### ప్రభుత్వ నిర్ణయం కోసం యువత చూపు

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): తాజాగా జరిగిన దుబ్బాక ఫలితం, గ్రేటర్ ఫలితాలతో ఇకనైనా ప్రజల పట్ల సానుకూల దృక్పథంతో ప్రభుత్వం ఉండాలని నిరుద్యోగులు కోరుకుంటున్నారు. నిరుద్యోగులు మరోమారు గళం వినిపించిన వేళ వారి ఆకాంక్షలు తీర్చేదిగా ప్రభుత్వచర్యలు ఉండాలని అన్నారు.

విమర్శలు చేయకుండా తెలంగాణ ప్రజల ఆకాంక్షలుగా గుర్తించి నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. నీళ్లు, నిధులు, నియామకాలు అన్న ఉద్యమ నినాదాన్ని ప్రభుత్వం పక్కదారి పట్టించకుండా జాగ్రత్తలు తీసుకుని, విమర్శకులను వ్యతిరేకులులగా భావించకుండా ముందుకు సాగాలి. సిఎం కెసిఆర్‌కు వాస్తవ పరిస్థితులు వివరించడం ద్వారా యావత్ తెలంగాణ సమాజం గమనిస్తుందని తెలియచేయాలి. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ శాఖలలో గల ఖాళీలపై ప్రభుత్వం దగ్గర పూర్తిస్థాయి సమాచారం ఉన్నప్పటికీ, ఉద్యోగాలను కేవలం జీతాల కోణంలో చూస్తూ భారంగా భావించరాదు. అనుత్పాదకరంగాలకు నిధులను తగ్గించుకోవాలి. అనవసర కేటాయింపులను తగ్గించాలి. దర్గాలకు, మొహమాటాలకు చెల్లింపులు చేయకుండా ఉంటే తెలంగాణ సమాజం కెసిఆర్ వెంటనే నడుస్తుందని గుర్తించలి.

ప్రజలే అతిపెద్ద ప్రచారకర్తలు. నిజంగానే ప్రభుత్వానికి బంగారు తెలంగాణ ఏర్పాటు చేయాలనే దృఢ సంకల్పం, చిత్తశుద్ధి ఉంటే పరిపాలన రంగం సక్రమంగా పనిచేసే విధంగా చూడాలి. దానికోసం ప్రతి శాఖకు సంబంధించిన నియమకాలు నిష్పక్ష పాతంగా జరిపి, ప్రజలకు ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంపొందించుకోవాలి. అంతేగానీ ప్రతీదాన్ని రాజకీయ కోణంలో చూడడం వల్ల ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లిపోతుంది. అంతేగాకుండా ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ప్రతిపక్ష పార్టీలకు ఒక బలమైన కారణం దొరుకుతుంది.

కోదండరామ్ లాంటి పోరుబాట పట్టడం, దానికి విపక్షాలు, నిరుద్యోగ ఐకాస, ప్రజాసంఘాలు మద్దతు పలకడం లాంటి పరిణామాలను తనకు అనుకూలంగా మార్చుకోవాలి. కొలువులు ఇస్తే,ప్రజలకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటే బిజెపి అసవరం రాదు. లేకుంటే ప్రభుత్వంపై వ్యతిరేకత రావడం సహజం. అయినప్పటికీ ప్రభుత్వంపై తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నమ్మకం ఉంది. కెసిఆర్ విషయంలో ఇంకా విశ్వాసంతో ఉన్నారు. తమకు తప్పకుండా న్యాయం జరుగుతుందని తెలంగాణ సమాజంలో భరోసా ఉంది. కొత్త రాష్ట్రం, కొత్త ప్రభుత్వం, కొత్త విధానాలు, బాలారిష్టాలు తొలిగి మంచిరోజులు వస్తాయన్న ఆశతో ఉన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వెంటనే పూర్తి స్థాయిలో ఉద్యోగ నియామకాలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా వుంది. అలాగే అనవసర ఖర్చులు తగ్గించుకుని యువతకు మేలుచేసేలా నిర్ణయాలు తీసుకోవాలి. అప్పుడు కెసిఆర్‌కు ఎదురుండదు. కాంగ్రెస్, బిజెపి చేస్తున్న విమర్శలు పట్టించుకోకుండా తెలంగాణ సమాజం గురించి ఆలోచన చేయాలి. కెటిఆర్ అలాంటి వారు విమర్శలతో సమస్యను పక్కదారి పట్టించరాదు. మరింత మెరుగైన విధంగా ముందుకు సాగితే మంచిది

# భాజపాలో చేరిన విజయశాంతి

### కమలం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అరుణ్ సింగ్
### విజయశాంతి రాకతో పార్టీ మరింత పుంజుకుంటుందన్న నేతలు
### -పార్టీలో కీలక పదవి దక్కే చాన్స్

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): సినీ గ్లామర్‌తో పొలిటికల్ ఫీల్డ్‌లో దుమ్మురేపిన సినీ నటులు ఎంతో మంది ఉన్నారు. కావాల్సినంత గ్లామర్, ప్రజల్లో ఎంతో గుర్తింపు అన్నీ ఉన్నా... రాములమ్మ మాత్రం ఇప్పటివరకూ రాజకీయాల్లో చెప్పుకోతగ్గ పాత్రను పోషించలేదు. సినిమాల్లో లేడీ బాస్‌గా, లేడీ అమితాబ్‌గా గుర్తింపు ఉన్నా అవేవీ ఆమెకు రాజకీయాల్లో ఇప్పటివరకూ కలిసి రాలేదు. తాజాగా ఢిల్లీలో... బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ సమక్షంలో కమలం కండువా కప్పుకున్నారు విజయశాంతి. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

విజయశాంతి రాకతో... తెలంగాణలో తమ పార్టీ మరింత పుంజుకుంటుందనే విశ్వాసంతో ఉన్నాయి బీజేపీ శ్రేణులు. బీజేపీ నుంచే రాజకీయ అరంగేట్రం:1998లో బీజేపీతోనే విజయశాంతి రాజకీయ ఆరంగేట్రం జరిగింది.



తర్వాత తల్లి తెలంగాణ పార్టీ పెట్టారు. కొన్నాళ్లకు దాన్ని టీఆర్ఎస్‌లో కలిపేశారు. టీఆర్ఎస్ నుంచి లోక్ సభకు ఎన్నికైన రాములమ్మ... ఆ తర్వాత... టీఆంఎస్ నుంచి సస్పెండ్ అయ్యారు. టీఆర్ఎస్‌లో విబేధాలతో... ఈ మాజీ మెదక్ ఎంపీ.... 2014 ఫిబ్రవరిలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మెదక్ నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేశారు. ఐతే... కాంగ్రెస్ పార్టీలోనూ ఆమె అధిష్టానానికి దూరంగా ఉంటూ వచ్చారు. పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉన్నారు. ఈ మధ్య బీజేపీకి అనుకూలంగా మాట్లాడటంతో... ఆమె బీజేపీలో చేరబోతున్నారనే ప్రచారం ఊపందుకుంది. అందుకు తగ్గట్టుగానే రాములమ్మ.. ఎవరు తీసుకున్న గోతిలో వారే పడతారన్న సామెత సీఎం కేసీఆర్‌కు సరిగ్గా వర్తించే సమయం సమీపించిందని అన్నారు. తద్వారా ఆమె బీజేపీ వైపు వెళ్తూ... టీఆర్ఎస్‌ని టార్గెట్ చేస్తున్నట్లు అర్థమవుతోంది.

# అందరిలోనూ ఉత్కంఠ

### అందరికంటే ముందువరుసలో రేవంత్ రెడ్డి
### రేవంత్‌కు గట్టిపోటినిస్తున్న కోమటిరెడ్డి
### టీపీసీసీ చీఫ్ రేసులో శ్రీధర్ బాబు?

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): దుబ్బాక జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఓటమితో తెలంగాణ పీసీసీ చీఫ్ గా ఉత్తమ్ కుమార్ రెడ్డి వైదొలిగారు. ఇప్పుడా హాట్ సీటు ఎవరికి వస్తుందనే ఉత్కంత అందరిలోనూ ఉంది. రేవంత్ రెడ్డి అందరికంటే ముందు ఉండగా.. కోమటిరెడ్డి తానే ముందు అని ప్రకటన ఇచ్చాడు. అయితే కాంగ్రెస్ లోని అన్ని వర్గాలకు వీరిద్దరూ ఆమోదయోగ్యం కాదని అంటున్నారు. టీపీసీసీ చీఫ్ గా సౌమ్యుడు వివాదరహితుడు అయిన మంథని కాంగ్రెస్ ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అయితే అందరికీ బెటర్ అని అభిప్రాయంఎ దుతున్నారు. కాంగ్రెస్ లోని అన్ని వర్గాల మద్దతు ఆయనకే ఉందని సమాచారం. అధిష్ఠానం ఆశీస్సులు కూడా శ్రీధర్ బాబుకు ఉన్నాయని అంటున్నారు. దీంతో టీపీసీసీ చీఫ్ రేసులో దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. పాత కరీంనగర్ జిల్లాలోని కాటారం మండలం ధన్వాడ శ్రీధర్ బాబు సొంతూరు. ఆయనకు రాజకీయాల్లో వివాదరహితుడిగా.. సౌమ్యుడిగా పేరుంది. అధిష్టానంతో నేరుగా సంబంధాలు ఉన్న శ్రీధర్ బాబును పీసీసీ చీఫ్ చేస్తే అన్ని వర్గాలను సమన్వయం చేయగలడని.. పార్టీకి పూర్వ వైభవం వస్తుందని అధిష్టానం భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఈ పీసీసీ చీఫ్ పదవి రేసులో రేవంత్ రెడ్డి కోమటిరెడ్డి జగ్గారెడ్డి జీవన్ రెడ్డి తదితర నేతలు అధిష్టానం వద్ద లాబీయింగ్ చేస్తున్నారు. వీరంతా రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతలే కావడంతో మిగతా వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇప్పటివరకు చేసిన ఉత్తమ్ కూడా రెడ్డి కావడంతో ఇప్పుడు వాళ్లకు ఇవ్వవద్దనే వాదన తెరపైకి వచ్చింది. బీసీలు లేదా ఇతర సామాజికవర్గాలకు ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తోంది. ఈ క్రమంలోనే శ్రీధర్ బాబు పేరు తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది. శ్రీధర్ బాబు బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన నేత కావడంతో ఆయనకు మద్దతు పెరుగుతోంది. పార్టీ పెద్దలతో సాన్నిహిత్యం ఉంది. మంథని ఎమ్మెల్యేగా మూడు సార్లు గెలిచాడు. వైఎస్ఆర్ హయాంలో మంత్రిగా చేశాడు. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నారు. కాంగ్రెస్ తరుపున దుద్దిళ్ల శ్రీపాదరావు స్పీకర్ గా పనిచేశాడు. ఇక శ్రీధర్ బాబుకు టీపీసీసీ చీఫ్ ఇస్తే అభ్యంతరం లేదని ఇప్పటికే కోమటిరెడ్డి రేవంత్ రెడ్డి స్పష్టం చేయడం విశేషం. దీంతో ఇక ఆయనకే అధిష్టానం ఇస్తుందని ప్రచారం సాగుతోంది

# మాల్యాకు చుక్కలు చూపిస్తోన్న మోదీ ప్రభుత్వం

### స్వదేశం రప్పించేదుకు ముమ్మర యత్నాలు

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): భారత బ్యాంకుల్లో వేలాది కోట్లు రుణాలు తీసుకుని విదేశాలకు చెక్కేసిన మద్యం వ్యాపారి విజయ్ మాల్యాను స్వదేశం రప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే విజయ్ మాల్యా విదేశీ ఆస్తులను ఈడీ జప్తు చేసి అతడికి పెద్ద షాక్ ఇచ్చింది. విజయ్ మాల్యాకు చెందిన ఫ్రాన్స్‌లోని 14 కోట్ల విలువైన ఆస్తులను మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద సీజ్ చేసినట్లు ఇప్పటికే ఈడీ వెల్లడించింది. ఈడీ విజ్ఞప్తితో ఫ్రాన్స్ అధికారులు ఆయన ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ప్రధానంగా ఫ్రాన్స్‌లోని 32 ఎవెన్యూ ఎఫ్‌వోసీహెచ్ వద్దనున్న విజయ్ మాల్యాకు చెందిన ఆస్తిని జప్తు చేసినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. దీని విలువ సుమారు 14 కోట్లుగా పేర్కొన్నారు. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ లిమిటెడ్ బ్యాంక్ ఖాతా నుంచి విదేశాలకు పెద్ద ఎత్తున నగదు మళ్లింపు జరిగినట్లు దర్యాప్తులో తేలిందని ఈడీ వెల్లడించింది. ఇదిలా ఉంటే ఇప్పటికే మాల్యాను దివాలాదారుడిగా ప్రకటించాలంటూ భారత బ్యాంకుల కన్సార్షియం దాఖలు చేసిన పిటిషన్‌ను లండన్ కోర్టు కొట్టేసింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని భారత ప్రభుత్వ రంగ బ్యాంకుల కన్సార్టియం పిటిషన్‌పై విచారణను కోర్టు వాయిదా వేసింది. విజయ్ మాల్యా 9 వేల కోట్ల రుణాలు ఎగవేశాడని... బకాయిలను వసూలు నిమిత్తం మాల్యాను దివాలా కోరుగా ప్రకటించాలని ఎస్‌బీఐ సారథ్యంలోని భారత బ్యాంకుల కన్సార్షియం లండన్ కోర్టును కోరింది.విజయ్ మాల్యాను అప్పగించాలంటే మరికొన్ని లీగల్ సమస్యలున్నాయని బ్రిటిష్ హైకమిషన్ తెలిపింది. బ్రిటన్ చట్టాల ప్రకారం.. పలు సమస్యలు పరిష్కారమయ్యేవరకు మాల్యా అప్పగింత ప్రక్రియ సాధ్యం కాదని తెలిపారు. అయితే త్వరలోనే ఆయన పిటిషన్ పై బ్రిటన్ న్యాయస్థానం నిర్ణయం తీసుకోనంది. సాధ్యమైనంత త్వరగా వీటి పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్టు పేర్కొన్నారు.బ్రిటన్ చట్టాల మేరకు అక్కడి హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసిన 28 రోజుల్లోగా ఒక వ్యక్తిని మరో దేశానికి అప్పగించాల్సి ఉంటుంది. కానీ ఆవ్యక్తి శరణార్థిగా ఆశ్రయం కోరితే మాత్రం ఆ దేశంలోనే ఉంటానని అప్పీలు చేస్తే.. ఆ ÷-లకెయిమ్ పరిష్కారమయ్యేవరకు అప్పగింత సాధ్యం కాదు. అయితే మాల్యా బ్రిటన్ శరణార్థిగా పిటిషన్ పెట్టుకున్నారా లేదా అనేది ఇంకా తేలాల్సి ఉంది. అయితే మాల్యా తరపు లాయర్ ఆనంద్ దూబే మాత్రం ఈ విషయంపై నోరు మెదపట్లేదు. ఇండియాలోని బ్యాంకులకు తొమ్మిది వేల కోట్ల రూపాయల మేర కుచ్చుటోపీ పెట్టి లండన్ వెళ్ళిపోయిన మాల్యాకు తిరిగి రుణం చెల్లించాలన్న ఉద్దేశం లేదని సీబీఐ వర్గాలు అంటున్నాయి. కానీ మాల్యా మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తున్నారు. తాను బకాయిలు చెల్లించడానికి రెడీగా ఉన్నానని ఇప్పటికే పలుసార్లు ప్రకటించినా బ్యాంకులు మాత్రం నమ్మడం లేదు.

## ఫైజర్ ప్రభావ ఫలితం 28 రోజుల తరువాతే

### కీలక విషయాలు వెల్లడించిన సంస్థ

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా వైరస్‌కు చెక్ పెట్టేందుకు ఫైజర్ వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఈ టీకాకు బ్రిటన్ ప్రభుత్వం ఆమోదముద్ర వేయడంతో మంగళవారం నుంచి మార్కెట్‌లోకి వచ్చింది. అలాగే భారత్‌లో అత్యవసర వినియోగానికి అనుమతి ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి ఆ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసిన కంపెనీ దరఖాస్తు చేసుకుంది. ఒకవేళ ఈ టీకాకు ప్రభుత్వం అనుమతిస్తే.. దానికి సంబంధించిన కీలక వివరాలు ఇలా ఉన్నాయి. ఫైజర్ టీకాను 70 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉంచాల్సి ఉంటుంది వైరస్‌ను నియంత్రించేందుకు రెండు డోసులు తీసుకోవాలట. ఒక్కో డోస్ రూ. 1500 ఉంటుందట డోసులు తీసుకున్న 28 రోజుల్లో వైరస్‌కు వ్యతిరేకంగా రోగ నిరోధక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది మొదటి డోస్ తీసుకున్న 12 రోజుకు రోగ నిరోధక వ్యవస్థ అభివృద్ధి చెందటం ప్రారంభమవుతుంది. 21వ రోజున రెండో డోస్ తీసుకోవాలి 28వ రోజున పూర్తిస్థాయి రోగనిరోధక శక్తి అభివృద్ధి అవుతుంది.

## వంద శాతం ప్రభుత్వ పథకాల అమలు

### ముఖ్రాకె గ్రామం దేశానికే ఆదర్శంగా నిలుస్తుంది
### సర్పంచ్‌ను అభినందించిన మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): పారిశుద్ధ్యంలో దేశంలోనే అత్యుత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైన అదిలాబాద్ జిల్లాలోని ముఖ్రాకె గ్రామ సర్పంచ్ గాడ్గె మీనాక్షి, ఎంపీటీసీ గాడ్గె సుభాష్‌లనుపంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అభినందించారు. తెలంగాణ రాష్ట్రంలోనే జీపీ ఓడీఎఫ్ ప్లస్ గ్రామంగా ముఖరా కె గ్రామపంచాయతీ ఎంపిక అయినందుకు మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. అలాగే తడి, పొడి చెత్త వేరు చేస్తూ సేంద్రీయ ఎరువులు తయారు చేస్తున్న ఏకైక గ్రామ పంచాయతీగా ముఖ్రా కె నిలిచింది. అంతేగాక వందకు వంద శాతం ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్న గ్రామంగా కూడా ఈ గ్రామం రికార్డు సృష్టించింది. గ్రామ స్వరాజ్య సాధనలో ముందున్న ముఖ్రాకె గ్రామం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ విధంగా గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలతోపాటు, గ్రామస్తులకు ,అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## తెలంగాణలో తగ్గుముఖం పట్టిన కరోనా కేసులు

### -కొత్తగా 517 కరోనా కేసులు నమోదు

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా కేసులు తగ్గుముఖం పట్టాయి. గడిచిన 24 గంటల్లో 517 కరోనా కేసులు నమోదు కాగా.. ఇద్దరు మృతి చెందారు. దీంతో మొత్తం ఇప్పటి వరకు రాష్ట్రంలో పాజిటీవ్ కేసుల సంఖ్య 2,73,858కు చేరింది. 1,474 మంది మరణించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 7,778 యాక్టివ్ కేసులుండగా.. చికిత్స నుంచి కోలుకుని 2,64,600 మంది డిశ్చార్జ్ అయ్యారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సోమవారం ఉదయం విడుదల చేసిన హెల్త్ బులిటెన్ లో తెలిపింది.

## నడిగర్ సంఘ భవనంలో భారీ అగ్ని ప్రమాదం

చెన్నై,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): చెన్నైలోని అభిబుల్లా రోడ్‌లోని యాక్టర్స్ అసోసియేషన్( నడిగర్ సంఘం) కార్యాలయ భవనంలో మంటలు చెలరేగాయి. నడిగర్ సంఘం ఆఫీస్ లో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం అందుతుంది ఈ అగ్నిప్రమాదంలో ఆఫీసుకు సంబంధించిన కీలక ఫైళ్లు అయినట్లు చెబుతున్నారు. తేనాంపేట నుండి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను నియంత్రిస్తున్నారు. ప్రస్తుతం ఈ సంఘానికి నటుడు నాజర్ అధ్యక్షుడిగా ఉండగా నటుడు విశాల్ జనరల్ సెక్రటరీగా ఉన్నారు. ఈ ప్రమాదంలో సామాగ్రితో పాటు కీలక ఫైళ్లు కూడా కాలిపోయాయని అంటున్నారు. నడిగర్ సంఘానికి నిధులు ఎంత ఉన్నాయి ? వాటిలో ఎంత ఖర్చు అయ్యాయి అనే విషయాలతో పాటు ఏ కార్యక్రమాలను నిర్వహించి ఎంత మేరకు నిధులు సేకరించారు అనే వివరాలకు సంబంధించిన ఫైళ్లు అన్నీ ఈ ఆఫీసులో ఉన్నాయని అంటున్నారు. దీంతో ఇది నిజం గానే ప్రమాదమా? లేక ఎవరైనా కావాలనే తగులబెట్టించారా ? అనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలపై దర్యాప్తు చేస్తున్నారు.

# రైతుల పాలిట గుదిబండ

### రైతు సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కింది
### కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టేందుకే నూతన వ్యవసాయ చట్టాలు
### భారత్ బంద్‌కు టీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు
### -స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని మంత్రి హరీష్ పిలుపు

సిద్దిపేట,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): కేంద్రం తెచ్చిన వ్యవసాయ చట్టాలు రైతుల పాలిట గుదిబండగా మారాయని మంత్రి హరీష్‌రావు విమర్శించారు. ఈనెల 8న భారత్ బంద్‌కు టీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని ఈ బంద్‌లో వ్యాపార, వాణిజ్య, ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టేందుకే నూతన వ్యవసాయ చట్టాలను కేంద్రం రైతులపై రుద్దుతోందని మండిపడ్డారు. రైతు సంక్షేమాన్ని కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందని దుయ్యబట్టారు. లేవీ సేకరణపై కేంద్రం జారీ చేసిన జీవోను రద్దు చేస్తే.. సన్నాలకు మద్దతు ధర పెంచి కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. నెల రోజుల్లోగా యాసంగి పంట రైతుబంధు డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తుందని చెప్పారు. ఈ చట్టాలు రద్దయ్యేంత వరకు రైతులతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ ప్రజల పార్టీ:ముడిక చంద్రశేఖర్

**-భారత్ బంద్‌కి, రైతులకు ప్రతి ఒక్కరు మద్దతు తెలుపాలి**



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి):కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని రైతులు తలపెట్టిన బందుకు ప్రతి ఒక్కరు మద్దతు తెలపాలని రాజన్న సిరిసిల్ల జిల్లా బీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముడిక చంద్రశేఖర్ అన్నారు. ఆయన నివాసంలో మీడియా సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగళవారం భారత్ బంధు కు ప్రతి ఒక్కరు మద్దతు తెలిపి, చట్టాలను రద్దు చేయించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, కాంగ్రెస్ పార్టీ అనేది ప్రజల పార్టీ అని, అన్నారు. రైతులకు 14 పార్టీలు బాసటగా నిలవడం సంతోషమని,కేంద్ర ప్రభుత్వనీ అవలంబిస్తున్న తీరు సరిఐనది కాదని తెలిపారు. వేములవాడ పట్టణ ప్రజలు,రేపు జరిగే భారత్ బంధు కు, మద్దతు తెలిపి ,మందు పాల్గొనాలని తెలిపారు....

## రైతులమద్దతుకు రేపటి బంద్ విజయవంతం చేయండి



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి):కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన వ్యవసాయ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని నేడు మంగళవారం దేశవ్యాప్తంగా జరుగుతున్న భారత్ బంద్ విజయవంతం చేయాలని వేములవాడ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి కోరారు . మంగళవారం ఉదయం 11.గంటలకు వేములవాడవిలీనం గ్రామమైన తిప్పాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పార్టీ నాయకులు ,కార్యకర్తలు రైతులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు .ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ దేశ అభివృద్ధికి ఇది "దేశాభివృద్ధికి ఇరుసుగా" ఉన్న వ్యవసాయాన్ని రంగాన్ని కార్పొరేటర్లకు అప్పగించడానికి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు .చట్టంలో మద్దతు ధర గురించి తప్పకుండా కార్పొరేట్ దయాదాక్షిణ్యాల మీద వదిలేయడం దారుణమని అన్నారు.

## నేర చరిత్ర గలవారు ఇకపైనా సత్ప్రవర్తన కలిగి ఉండాలి

**అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే**

**కఠిన చర్యలు తప్పవు - సీఐ వెంకటేష్**



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ పట్టణ పరిధిలో ని రౌడీ షీటర్స్ మరియు నేర చరిత్ర కలిగిన వ్యక్తులు సతప్రవర్తన కలిగి ఉండాలి అని వేములవాడ పట్టణ ఇన్స్పెక్టర్ ఓ వెంకటేష్ తెలిపారు. ఇటీవల పీడీ యాక్ట్ లో జైలు కి వెళ్లిన ముద్రకోల వెంకటేశం గురించి ప్రస్తావిస్తూ ఈ సంవత్సరం అక్టోబర్ లో వెంకటేష్ పై పీడీ యాక్ట్ ప్రపోసల్ పంపంగా అతన్ని పీడీ యాక్ట్ లో జైలు కు పంపగా ప్రస్తుతం శిక్ష అనుభవిస్తూ తేది: 5-12-2020 రోజున ముద్రకోల వెంకటేష్ అడ్వైసరీ బోర్డు కు అభ్యర్థన పెట్టుకోగ తన నేరచరిత్ర ను పరిగణలోకి తీసుకొని బోర్డు అట్టి పిటిషన్ ను కొట్టివేస్తూ తన శిక్ష ను అలాగే కొనసాగించవలసిందిగా ఉత్తర్వులు ఇవ్వటం జరిగింది,కాబట్టి నేర ప్రవృత్తిని కలిగి వున్నవారు ఇక ముందు ఇలాంటి కార్యకలాపాల కు పాల్పడిన చట్టం నుండి తప్పించుకోలేరని శిక్ష కచ్చితంగా అనుభవిస్తారు కాబట్టి జాగ్రత్త గా ఉండాలి అని ఇన్స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు.

## రైతులకు తోడ్పాటు ఇవ్వని మార్కెట్లు

**-అన్నదాతలను పట్టించుకోని నాయకులు**

కరీంనగర్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో మినీ కూరాయల మార్కెట్లు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. ఇకపోతే కూరగాయల రైతులను ప్రోత్సహిస్తే వారు వరిని పండించదరని అంటున్నారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు, సౌకర్యాలు ఇవ్వాలని కోరుతున్నారు. చుట్టుపక్కల గ్రామాల రైతులు పండించే కూరగాయాలను నేరుగా కరీంనగర్ పట్టణానికి తెచ్చుకుని అమ్ముకునేలా చేస్తేరైతులుకు మేలు కలుగుతుం ది. అలాగే కూరగాయల ధరలు పెరగకుండా నిరంతరంగా వారు పంటలు పండిస్తే అటు రైతులకు, ఇటు వినియోగదారులకు మేలు చేకూరుతుంది. కూరగాయలు కొనేందుకు ఐదారు కిలోమీటర్ల దూరం నుంచి ప్రజలు రావాల్సి వస్తుందనే ఉద్దేశంతో కొత్త మార్కెట్ల కోసం గత పాలకవర్గ సభ్యులు పలుమార్లు తీర్మానా లు చేసి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినా ఆ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చడం లేదు. దీంతో తాము తెచ్చే కూరగాయలు అమ్ముకోవడానికి మార్కెట్ లేక రైతులు వీధుల్లో అమ్ముకుంటు న్నారు. దీంతో వారికి గిట్టుబాటు కావడం లేదు. నాలుగు మార్కెట్ల కోసం పురపాలకకు ప్రతిపాదనలు పంపించగా.. అందులో డీటీసీపీ ఒక దానికే అనుమతి లభించిందని కరీంనగర్ నగర మేయర్ రవిందర్‌సింగ్ గతంలోనే తెలిపారు. అయితే ప్రజా అవసరాలకు తగ్గట్లు మార్కెట్లు ఉండాలనే ప్రభుత్వ ప్రతిపాదనలు ఆచరణలోకిరావడం లేదు. నగరంలోని మూడు మార్కెట్ల అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మరో రెండు కూడా అధికారులు ప్రతిపాదనలు చేస్తుండటంతో నిధుల సమస్య ముందుకు వచ్చింది. నిధులను శ్మశానవాటికలు, మార్కెట్ల అభివృద్ధి, మాంసాహార మార్కెట్లు, ఖాళీ స్థలాలకు ప్రహరీలు, కబేళాలు, కూడళ్ల అభివృద్ధికి కేటాయించడంతో ఆ నిధులు సరిపోయే పరిస్థితి లేదు. కొత్తగా మార్కెట్లు ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల సంఖ్య తగ్గి ప్రధాన కూరగాయల మార్కెట్‌కు భారీగా రద్దీ తగ్గే అవకాశం ఉంటుంది. కాలనీల మధ్య చిన్న మార్కెట్లు ఏర్పాటు చేయాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తున్నా.. నిధుల కొరత.. అరకొర కేటాయింపుల కారణంగా అడుగు ముందుకు పడటం లేదు.. ప్రభుత్వం సైతం మార్కెట్లు విస్తరించాలని, కొత్తగా ఏర్పాటు చేసేందుకు పురపాలికలు ముందుకు రావాలని పేర్కొన్నా.. ఆ దిశలో చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రధాన కూరగాయల మార్కెట్లు నాలుగు ఉండగా అందులో రెండు రైతు బజార్లే.. మరో రెండింటిలో ప్రధాన కూరగాయల మార్కెట్, రాంనగర్ కూరగాయల మార్కెట్ ఉన్నాయి. పాతబజారులో రోడ్డుపై కూరగాయలు అమ్ముతుండగా, ముకరంపుర ప్రాంతంలో రోడ్డుపైనే విక్రయాలు జరుపుతున్నారు. ఇకపోతే సిద్దిపేటలాగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించాలని కోరుతున్నారు.

## ఐఐటీ విద్యార్థి అరుదైన ఘనత

**అమెరికాలోని ఉటా యూనివర్సిటీ స్కాలర్‌షిప్‌కు ఎంపిక**

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): తిభకు పేదరికం అడ్డుకాదని ఎన్నోసార్లు నిరూపించారు విజేతలు. అలాంటి విజయాన్నే సాధించాడు బీహార్ కు చెందిన రాహుల్ కుమార్ (22) అనే ఐఐటీ విద్యార్థి. బీహార్ నలందా జిల్లాలోని సోసాండి అనే మారుమూల గ్రామానికి చెందిన రాహుల్ కుమార్... దేశంలోని అత్యున్నత విద్యాసంస్థలలో ఒకటైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) రూర్కీ నుంచి మెటలర్జికల్, మెటీరియల్స్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేశాడు. నిరుపేద కుంటుంబానికి ఆయన తండ్రి సునీల్ సింగ్ (52) రోజువారి కూలీగా సూరత్‌తో విద్యుత్ మగ్గంపై పనిచేస్తారు.

మొదట బీహార్‌లో ఉన్న ఆయన కుటుంబం జీవనోపాధి కోసం గుజరాత్‌కు వలస వెళ్లింది. ఐఐటీ రూర్కీలో చదివిన రాహుల్ తన అకడమిక్‌లో ఉన్నతంగా రాణిస్తూ, ఎల్లప్పుడూ సమాజ శ్రేయస్సు వైపు ఆలోచించేవాడు. సమాజ సేవపై అతనికి ఉన్న ఉత్సాహంతో ఐఐటి రూర్కీ నేషనల్ సర్వీస్ స్కీమ్ ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యాడు. అంతేకాక, ఐఐటీ రూర్కీలో డిజిటల్ మోడ్ ద్వారా ఇటీవల నిర్వహించిన వార్షిక సమావేశంలో భాగంగా తన సామాజిక కార్యక్రమాలను గుర్తించిన కాలేజీ యాజమాన్యం మాజీ రాష్ట్రపతి డాక్టర్ శంకర్ దయాల్ శర్మ పేరుతో ఇచ్చే బంగారు పతకంతో ఆయన్ను సత్కరించింది. కాగా, ఈ ఏడాదే ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న కుమార్... అమెరికాలోని ఉటా విశ్వవిద్యాలయంలో పీ హెచ్ డీ అడ్మిషన్‌తో పాటు, అదే యూనివర్సిటీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బోధించేందుకు స్కాలర్‌షిప్ అర్హత కూడా సాధించాడు.

# మీ సేవా కేంద్రాల దగ్గర బారులు తీరిన బాధితులు

**వరద సాయం నేరుగా ఖాతాల్లోనే వేస్తామన్న జీహెచ్ఎంసి**

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రక్రియ పూర్తవడంతో 10 వేల రూపాయల సాయం అందని వరద బాధితులు మీ సేవ కేంద్రాల వద్ద బారులు తీరారు. అయితే అలాంటి వారికి జీహెచ్ఎంసీ కీలక సూచన చేసింది. వరద బాధితులు మీసేవ సెంటర్లకు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్ కుమార్ కీలక ప్రకటన చేశారు

. వరద బాధితులకు పభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని నేరుగా వారి ఖాతాల్లోకి జయు చేయనున్నట్టు వెల్లడించారు. బాధితుల ధ్రువీకరణ పూర్తయ్యాక ఇందుకు సంబంధించిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకోసం జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సాయం అందని బాధితుల వివరాలు సేకరిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బాధితులు మీ సేవల సెంటర్ల చుట్టూ తిరుగొద్దని కోరారు. గత నెలలో చోటు చేసుకున్న భారీ వర్షాలకు హైదరాబాద్ లో పలు కాలనీలు మునిగిపోయాయి. చాలా మంది తమ ఇంట్లో విలువైన సామాగ్రి నష్టపోయారు. దీంతో వరద ముంపుకు గురైన బాధితులకు తెలంగాణ ప్రభుత్వం 10 వేల ఆర్థిక సాయం ప్రకటించింది. కొన్ని రోజులు పాటు వరద సాయం పంపిణీ చేశారు. ఇందుకోసం బాధితుల మీ సేవా కేంద్రం దగ్గర కిలోమీటర్ల మేర బారులు తీరారు. ఒకానొక సందర్భంలో తెల్లవారుఝామునే మీ సేవా కేంద్రాల దగ్గర పడిగాపులు కాసారు. అయితే జీహెచ్ఎంసీ ఎన్నికల కోడ్ రావడంతో దానిని నిలిపివేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత సాయం అందనివారికి 10 వేలు అందజేయనున్నట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు.అయితే తాజాగా జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో మరోసారి వరద బాధితులు మీ సేవ సెంటర్ల మందు బారులు తీరారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని.. బాధితులకు వరద సాయం అందజేయాలని కోరుతున్నారు. మీ సేవ సెంటర్ల వద్ద భారీగా జనాలు చేరుకోవడంతో.. పలుచోట్ల మీ సేవ సెంటర్లను నిర్వాహకులు మూసివేస్తున్నారు. ఇక, వరద సాయం కోసం వచ్చినవారిని పోలీసులు ఇళ్లకు పంపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే బాధితులు మాత్రం తమకు వెంటనే సాయం అందించాలని ఆందోళ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్ చేసిన ప్రకటనతో స్పష్టత వచ్చినా.. బాధితులు మాత్రం పూర్తిస్థాయిలో నమ్మడం లేదు. వెంటనే సాయం అందించాలని, ఎన్నికలు అయిపోయిన తర్వాత మాట తప్పుతున్నారని మండిపడుతున్నారు.

# విరష్క జోడీ నెట్ వర్త్ 1200 కోట్లు

**సంపాదనలో అదరగొడుతున్న జంట**

ముంబై,,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): ప్రపంచ క్రికెట్ లో పరుగుల రారాజుగా ప్రత్యర్థులపై ఆధిపత్యం చెలాయిస్తున్న టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ.. సంపాదనలో కూడా అదరగొడుతున్నాడు. బాలీవుడ్ హీరోయిన్ అనుష్క శర్మను ప్రేమించి పెళ్లి చేసుకున్న కోహ్లీ జనవరిలో తండ్రి కాబోతున్నాడు. ఈ ఇద్దరూ తమ తమ రంగాల్లో రాణిస్తూ కోట్లు ఆర్జిస్తున్నారు. వరల్డ్ క్లాస్ క్రికెటర్‌గా కోహ్లీ.. ఎంటర్‌టైన్‌మెంట్ క్వీన్‌గా అనుష్క శర్మ కు ప్రపంచ వ్యాప్తంగా మంచి క్రేజ్ ఉంది. ప్రస్తుతం విరుష్క జోడీ నెట్‌వర్త్ సుమారు 1200 కోట్లకు చేరిందని, దేశంలో రిచెస్ట్ అత్యంత సంపన్నమైన సెలెబ్రిటీ జోడీగా నిలిచిందని వ్యాపార వర్గాలు పేర్కొనడం చర్చనీయాంశమైంది. 2013లో షాంపూ అడ్వర్టైజ్‌మెంట్ కోసం తొలిసారి కలుసుకున్న అనుష్క, విరాట్ ఆ తర్వాత నాలుగేళ్లు ప్రేమలో మునిగి 2017లో వివాహబంధంతో ఒక్కటయ్యారు. వివాహమైనా అనుష్క తన కెరీర్‌ను కొనసాగించింది. ఈ ఇద్దరి సంపాదనలో ప్రధాన భాగం అడ్వర్టైజ్‌మెంట్స్ ఒప్పందం ద్వారా వచ్చేవే. 2019 ఫోర్బ్స్ లెక్కల ప్రకారం, విరాట్ కోహ్లీ నెట్‌వర్త్ సుమారు 252 కోట్లు. టాప్-100 సెలెబ్రిటీస్‌లో ఒకడిగా ఉన్న విరాట్ విరాట్ నికర ఆస్తుల విలువ సుమారు 900 కోట్లుగా ఉంటుందని కొన్ని నివేదికలు పేర్కొన్నాయి. విరాట్ కోహ్లీ సంపాదనలో ప్రధాన భాగం తన సొంత వ్యాపార పెట్టుబడులు, ప్రచారకర్తగా చేసుకున్న ఒప్పందాల నుంచే వస్తోంది. క్రికెట్‌పరంగా.. బీసీసీఐ నుంచి ఏడాదికి 7 కోట్లు ఆర్జిస్తున్న విరాట్.. ఐపీఎల్‌లో ఆర్సీబీ నుంచి 18 కోట్లు తీసుకుంటున్నాడు. అతనికి రెండు రెస్టారెంట్స్ కూడా ఉన్నాయి.ఇక ఫోర్బ్స్ లెక్కల ప్రకారం గతేడాది అనుష్కా నెట్‌వర్త్ 28.67 కోట్లు.. కాగా 2018లో 45.83 కోట్లు ఆర్జించింది. ఇక ఓవరాల్‌గా ఆమె నికర ఆదాయం 350 కోట్లకు పైగానే ఉంటుంది. అయితే 2018 నుంచి ఆమె ఎలాంటి సినీ ఒప్పందాలు కుదుర్చుకోకపోవడం ఆదాయం తగ్గింది. కానీ సినీ నిర్మాణ రంగంలో అడుగుపెట్టింది. ఇక విరుష్కకు ముంబైలో 34 కోట్లు విలువ చేసే లగ్జరీ అపార్ట్‌మెంట్ ఉంది. గుర్గ్రాన్‌లో రూ. 80 కోట్ల విలువ చేసే ఆస్తులున్నాయని కూడా ప్రచారం జరుగుతోంది.

# అంచనాకు చిక్కని కరోనా నష్టం

**సంపన్న దేశాలు సైతం ఉక్కిరిబిక్కిరి**

**తీవ్ర పేదరికంలోకి జారుకోనున్న20 కోట్ల మంది**

**ఐక్యరాజ్యసమితి తాజా నివేదిక**

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): ప్రపంచాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన కరోనా.. ఎంతటి నష్టానికి గురి చేసిందో అంచనా వేయలేనంత భారీగా మారింది. ఇప్పటికే బయటకు వచ్చినవే కాదు.. బయటకురాని అంశాలెన్నో ఉన్నట్లు చెబుతున్నారు. కరోనా కారణంగా ఇప్పటికే లక్షలాది మంది ప్రాణాలు విడవగా..కోట్లాది మందికి ఈ పాడు వైరస్ సోకి తెగ ఇబ్బందులు పడ్డారు.

ఇదంతా ఒక ఎత్తు అయితే.. ఆర్థికంగా జరిగిన నష్టం అంతా ఇంతా కాదు. కరోనా కారణంగా సంపన్న దేశాలు సైతం ఉక్కిరిబిక్కిరి కావటంతో పాటు.. కొత్త సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. మరో నెల వ్యవధిలో వ్యాక్సిన్ వచ్చేస్తుందన్న రిలీఫ్ వేళ.. వణికించే వాస్తవాలు బయటకు వస్తున్నాయి.తాజాగా అలాంటి వాస్తవాన్నే వెల్లడించింది ఐక్యరాజ్యసమితి. కరోనా కారణంగా రానున్న రోజుల్లో 20 కోట్ల మంది తీవ్ర పేదరికంలో జారుకోనున్నట్లు ఐక్యరాజ్యసమితి అంచనా వేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికే పేదరికంలో ఉన్న వారిలో కలిసి 2030 నాటికి దాదాపు 100 కోట్ల మంది వరకు కటిక పేదరికాన్ని అనుభవించే దారుణ పరిస్థితులు నెలకొన్నట్లుగా చెబుతున్నారు. కరోనా కారణంగా రానున్న పదేళ్లలో ప్రపంచం ఎదుర్కొనే పరిస్థితులు.. పరిణామాలపై ఐక్యరాజ్యసమితిలోని ఒక విభాగం పరిశోధనలు జరిపింది. రానున్న పదేళ్లలో డెవలప్ మెంట్ మీద ఇది చూపే ప్రభావం ఎంతన్న అంశాన్ని పరిశీలించింది. దీని ప్రకారం.. కరోనాకు ముందు ఉన్న అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2030 నాటికి 4 కోట్ల మంది వరకు ప్రజలు తీవ్రమైన పేదరికంలో బతుకుతారని ఐఎంఎఫ్ (అంతర్జాతీయ ద్రవ్యనిధి) నివేదికలు స్పష్టం చేశాయి. కరోనా దెబ్బకు ఆ అంచనాలు మారిపోయాయి. కరోనా నుంచి కోలుకోవటానికి ఎక్కువ కాలం పడితే పదేళ్ల తర్వాత 20 కోట్ల మంది తీవ్రమైన పేదరికంలోకి జారే అవకాశం ఉందంటున్నారు. కరోనా కారణంగా పదేళ్ల పాటు ఆర్థిక సంక్షోభం ఉంటుందన్న అంచనా వ్యక్తమవుతోంది. కరోనా నేపథ్యంలో సాధ్యమైనంత త్వరగా వెనుకటి పరిస్థితుల్లోకి వెళ్లేలా ప్రభుత్వాలు ప్రయత్నించాలని చెబుతున్నారు.

కరోనాతో తీవ్రమైన సంక్షోభం చోటు చేసుకున్నా.. సుస్థిరమైన డెవలప్ మెంట్ ను సాధించేందుకు కొత్త విధానంలో ముందుకు వెళ్లే అవకాశాన్ని కల్పించిందని చెబుతున్నారు. ఏమైనా.. కరోనా ప్రపంచవ్యాప్తంగా పేదరికాన్ని ఎంతలా పెంచిందన్న విషయం తాజా పరిశోధన స్పష్టం చేసిందని చెప్పక తప్పదు.

# ఈ - కార్ట్ వాహనాలను ప్రారంభించిన కలెక్టర్

ఆదిలాబాద్, డిసెంబర్ 7:: విజయ డెయిరీ ద్వారా పాడి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. అదిలాబాద్ విజయ డెయిరీ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఈ- కార్ట్ వాహనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఈ కార్ట్ మొబైల్ వాహనాల ద్వారా విజయ పాల ఉత్పత్తులను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ వాహనాలను నిరుద్యోగ యువకులకు 30 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ లోక భూమారెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో 50 వాహనాలను నిరుద్యోగులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగతా జిల్లాల్లో సైతం ఈ వాహనాల ద్వారా విజయ పాల ఉత్పత్తులను విక్రయించినట్లు తెలిపారు. రైతులు విజయ డెయిరీ కేంద్రాల్లో పాలను విక్రయించి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను పొందాలని సూచించారు.




# అభ్యర్థిని తేల్చకుండానే ప్రచారం

**తిరుపతి ఉప ఎన్నికపై జనసేన-బీజేపీ ప్రచారం ముమ్మరం**

తిరుపతి,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): తిరుపతి పార్లమెంటు స్థానం విషయంలో దూకుడుగా ఉన్న బీజేపీ-జనసేన పార్టీలు అనధికార ప్రచారం మొదలు పెట్టేశాయి. పైకి తిరుపతి ఉప ఎన్నికను ప్రస్తావించకుండానే.. ఈ రెండు పార్టీల నాయకులు కూడా ప్రచారం ప్రారంభించాయనే చెప్పాలి. నివర్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని రైతులను ఓదార్చుతా నంటూ.. జనసేన అధినేత పవన్ ప్రచారం ప్రారంభించేశారు. ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. కేవలం తుఫాను బాధితులను ఓదార్చేందుకే అయితే.. ఆయన చేస్తున్న విమర్శల్లో సగం చాలు. కానీ, ఆయన వ్యూహం అంతా తిరుపతిపైనే ఉండడంతో ఆ దిశగానే వ్యాఖ్యలు దూసుకువస్తున్నాయి. అసెంబ్లీలో అధికార ప్రతిపక్షాల మధ్య వివాదాన్ని సైతం ఆయన విమర్శిస్తున్నారు. మద్యం ధరల పెంపును ప్రస్తావించారు. ఇంటి పన్నులు పెంచుతూ తీర్మానం చేయడంపైనా ఆరోపణలు గుప్పించారు. సీఎం గా జగన్ ఏం సాధిస్తున్నారని.. ప్రశ్నించారు. అదేసమయంలో నష్టపోయిన రైతాంగానికి భారీ సాయం చేయాలని కూడా ప్రస్తావిస్తున్నారు. జోరు వర్షంలోనూ పవన్ గొడుగు పట్టుకుని చేస్తున్న ప్రసంగాల వెనుక సంపీతీని తట్టి లేపుతున్నారని అంటున్నారు పరిశీలకులు. ఇక, ఈ పరిణామాలను గమనిస్తే.. తిరుపతి ఉప పోరును దృష్టిలో పెట్టుకునే పవన్ ఇలా చేస్తున్నారని చెబుతున్నారు.

ఇక, బీజేపీ విషయాన్ని తీసుకుంటే.. కీలకమైన మౌలిక సదుపా యాలపై ఈ పార్టీ నేతలు ఫోకస్ చేశారు. నివర్ తుఫాన్ బాధితుల సమస్యను పక్కన పెట్టి.. రోడ్లు, కాలువలు.. అంటూ.. రోడ్డున పడ్డారు. బీజేపీ రాష్ట్ర చీఫ్ సోము వీర్రాజు.. మీరు ఒక్కసారి ఈ రోడ్లపై నడిచి చూడండి! అంటూ.. సీఎం జగన్‌కు సవాలు రువ్వారు. ఇక, పార్టీ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి మరింతగా రోడ్ల సమస్యపై కదం తొక్కారు. ఈ పరిణామాలను గమనిస్తే.. వీరు కూడా తిరుపతి ఉప పోరును దృష్టిలో ఉంచుకునే ప్రజల్లో కనిపించేందుకు తాపత్రయ పడుతున్నారని అంటున్నారు పరిశీలకులు. అయితే.. చిత్రం ఏంటంటే.. ఈ రెండు పార్టీలూ ఉమ్మడిగానే ఇక్కడ పోటీ చేయాలని నిర్ణయించాయి. కానీ, టికెట్ విషయం ఇంకా ఏమీ తేలలేదు. ప్రస్తుతం ఈ టికెట్ విషయంపై తేల్చేందుకు కేంద్ర బీజేపీ.. ఒక కమిటీ వేస్తానని చెప్పినా.. ఇంకా వేయలేదు. తిరుపతి టికెట్ తమకు కావాలని పవన్ ఇప్పటికే పట్టుదలతో ఉన్నారు. అందుకే తాను.. గ్రేటర్ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నట్టు తాజాగా కూడా చెప్పుకొచ్చారు. అయితే.. బీజేపీ కూడా ఇదే పట్టుదలతో ఉంది. తమకే కావాలని.. అంటోంది. ఈ క్రమంలో ఇరు పార్టీల మధ్య ఈ టికెట్ విషయం తేలకుండానే.. ఇరుపక్షాలు ఎవరికి వారు తిరుపతి ఉప ఎన్నికను దృష్టిలో పెట్టుకుని.. అనధికార ప్రచార పర్వానికి తెరదీయడం ఆసక్తిగా మారింది. మరి ఎవరు దక్కించుకుంటారో చూడాలి.

### మహారాష్ట్ర నుంచి తమిళనాడుకు ఈవీఎంలు

చెన్నై,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): రాష్ట్ర అసెంబ్లీకి 2021లో జరగనున్న ఎన్నికలకు మహారాష్ట్ర ఈవీఎంలు కేటాయించారు. 'బెల్' సంస్థ నుంచి కొనుగోలు చేస్తున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లను పలు రాష్ట్రాల ఎన్నికలకు వినియోగిస్తున్నారు. ఎన్నికల ముగిసిన అనంతరం మూడు నెలల వరకు ఈవీఎంలలో నమోదైన ఓటింగ్‌ను తొలగించకుండా 'స్ట్రాంగ్ రూమ్'లో భద్రపరుస్తుంటారు. అనంతరం ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ఈవీఎంలను తరలిస్తుంటారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రాష్ట్రానికి కొత్త ఈవీఎంలను కొనుగోలు చేశారు. అనంతరం వాటిని మహారాష్ట్ర ఎన్నికలకు తరలించారు. ప్రస్తుతం మహారాష్ట్రలోని ఈవీఎంలను రాష్ట్ర అసెంబ్లీలో వినియోగించనున్నారు.

## జానారెడ్డికి బీజేపీ గాలం

**జానా చేరికతో పార్టీ మరింత పటిష్టపడే అవకాశం**

**పావులు కదుపుతున్న కమలం నేతలు**

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని ఇబ్బంది పెట్టడానికి భారతీయ జనతా పార్టీ ఎన్నో విధాలుగా ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ చాలా వరకు కూడా నష్టపోయింది. తెలంగాణాలో కూడా పార్టీ తెలంగాణ ఇచ్చినా సరే ప్రజల మద్దతు కూడగట్టుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిందే. త్వరలో జరగబోయే నాగార్జున సాగర్ ఎన్నికలలో అయినా సరే ఆ పార్టీ విజయం సాధించకపోతే మాత్రం ఖచ్చితంగా ఇబ్బందులు పడే అవకాశాలు ఉంటాయి. ఆ పార్టీ నుంచి సీనియర్ నేత జానారెడ్డి నాగార్జునసాగర్ నుంచి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి అని అంటున్నారు. అయితే ఆయనకు భారతీయ జనతా పార్టీ గాలం వేసింది అని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అప్రమత్తమైంది. ఆయనతో చర్చలు జరపడానికి కాంగ్రెస్ పార్టీ కీలక నేతలు రంగంలోకి దిగారు. ఇప్పటికే ఆయనతో మాట్లాడడానికి కాంగ్రెస్ అధిష్టానం నుంచి రాహుల్ గాంధీ కూడా ప్రయత్నాలు చేస్తున్నారు అని రాజకీయ వర్గాల్లో పెద్దఎత్తున చర్చలు జరుగుతున్నాయి. జానారెడ్డి పార్టీ మారితే మాత్రం నాగార్జునసాగర్ ఉప ఎన్నికల్లో కచ్చితంగా భారతీయ జనతా పార్టీ విజయం సాధించే అవకాశం ఉంటుంది. ఆయన ఇంట్లో ఉన్న సరే గెలిచే నేత. 2018 ఎన్నికల్లో మాత్రం ఆయన విషయంలో టీఆర్ఎస్ పార్టీ కాస్త ఎక్కువగా ఫోకస్ పెట్టింది అని అందుకే ఆయన ఓటమి పాలయ్యారు అని అంటున్నారు. ఏది ఎలా ఉన్నా సరే ఇప్పుడు జానా రెడ్డి విషయంలో భారతీయ జనతా పార్టీ వర్సెస్ కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మారిందని అంటున్నారు. అయితే ఆయనకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సిద్ధమైనట్లుగా కూడా ఈ మధ్య కాలంలో ప్రచారం జరుగుతోంది. అయితే రేవంత్ రెడ్డిని ఆ పదవికి ఎంపిక చేసే అవకాశాలు ఉండవచ్చు అని భావిస్తున్నారు. మరి భవిష్యత్తులో ఎలాంటి ముందడుగు పడుతుంది ఏంటి అనేది చూడాలి.

## భారత్ బంద్‌లో పాల్గొనండి

**రైతులకు నష్టం కలిగించే బిల్లును వ్యతిరేకించాలి**

**-మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్**



హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): భారత్ బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్. రైతులకు నష్టం కలిగించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన వ్యవసాయ బిల్లుకు వ్యతిరేకంగా రైతు సంఘాలు బంద్‌కు పిలుపునివ్వగా టీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో టీఆర్ఎస్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడిన తలసాని.. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే బంద్‌కు అన్ని వ్యాపార వాణిజ్య సంస్థలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ టీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, కార్పొరేటర్లు కొలన్ లక్ష్మీ, కురుమ హేమలత, మహేశ్వరి, నామన శేషుకుమారి, అత్తిలి అరుణ, ఉప్పల తరుణి, ఆకుల రూప, టీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. నూతన వ్యవసాయ బిల్లును నిరసిస్తూ 8 వ తేదీన చేపట్టే భారత్ బంద్ కు ముఖ్యమంత్రి కేసీఆర్ మద్దతు ప్రకటించారని చెప్పారు. ఈ నేపథ్యంలో 8 వ తేదీ ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించే బంద్ కు అన్ని వ్యాపార వాణిజ్య సంస్థలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భారత్ బంద్ సందర్భంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి 2 వేల వాహనాలతో బైక్ ర్యాలీ ప్రారంభించి మోండా మార్కెట్, మహంకాళి వీధి, జనరల్ బజార్, ప్యారడైజ్, బేగంపేట్, అమీర్ పేట్ ల మీదుగా సనత్ నగర్ వరకు నిర్వహించడం జరుగుతుందని మంత్రి వివరించారు. జీహెచ్ఎంసి ఎన్నికల ఫలితాల సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ గెలుపు, ఓటములు సహజమని చెప్పారు. ఓడినా, గెలిచినా నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజల మనసులను గెలుచుకోవాలని సూచించారు. శుక్రవారం నుండి మీ మీ డివిజన్ లలో పాదయాత్రలు నిర్వహించడం ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకోవాలని చెప్పారు. తాను కూడా పాదయాత్ర ల లో పాల్గొంటానని మంత్రి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల లో శ్రమించిన ప్రతి ఒక్కరిని మంత్రి అభినందించారు.

## ఎవరైనా రాజకీయాల్లో చేరవచ్చు

**రజినీ రాజకీయ విధానం ఏమిటో చెప్పాలి**

**డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్**

చెన్నై,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): రాజకీయాల్లోకి ప్రవేశించనున్నట్లు అధికారికంగా ప్రకటించి, 2021 జనవరిలో తన రాజకీయ పార్టీని ప్రారంభిస్తానని సూపర్‌స్టార్ రజినికాంత్ వ్యాఖ్యలపై డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ ఆలస్యంగా స్పందించారు. ఎవరైనా రాజకీయాల్లో చేరవచ్చని, తన రాజకీయ భావజాలాన్ని వెల్లడించిన తర్వాతే రజనీకాంత్ రాజకీయ ఆరంగేట్రం గురించి మాట్లాడుతా అని స్టాలిన్ అన్నారు. వచ్చే ఏడాది జనవరి నెలలో పార్టీని ప్రకటించనున్నట్లు సూపర్‌స్టార్ రజినీకాంత్ మూడు రోజుల క్రితం అధికారికంగా ప్రకటించారు. రజినీకాంత్ రాజకీయ ప్రవేశంపై స్పందించాలని మీడియా కోరడంతో.. "ఎవరైనా రాజకీయాల్లో చేరవచ్చు. రజినీకాంత్ మొదట తన పార్టీని ప్రారంభించనివ్వండి. అతని రాజకీయ విధానం ఏమిటో చెప్పనివ్వండి. అప్పుడు నేను వ్యాఖ్యానిస్తాను" అని స్టాలిన్ అన్నారు. తమిళారువి మానియన్‌ను తన రాజకీయ సలహాదారుగా ఎన్నుకోవడం గురించి తమిళ సూపర్ స్టార్ రెండవ ఆలోచనలో ఉన్నట్లుగా తనకు తెలిసిందని డీఎంకే అధ్యక్షుడు పేర్కొన్నారు. వచ్చే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో రజనీకాంత్ రాజకీయ పార్టీ మొత్తం 234 స్థానాల్లో పోటీ చేస్తుందని అంతకుముందు మణియన్ శనివారం చెప్పారు. "మా రాజకీయాలు ద్వేష రాజకీయాలకు భిన్నంగా ఆధ్యాత్మిక రాజకీయాలుగా ఉంటాయి, ప్రస్తుతం ఇది ఆచరణలో ఉంది. మేము ఎవరినీ నిందించం" అని మానియన్ అన్నారు. రాజకీయ సలహాదారుగా మానియన్‌ను మార్చే ఆలోచనలో రజినీకాంత్ ఉన్నట్లు స్టాలిన్ వ్యాఖ్యానించడంతో.. రజినీ గ్రూపులో అప్పుడే లుకలుకలు మొదలయ్యాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

## కేసీఆర్ అవినీతి చిట్టా అంతా మా చేతిలో ఉంది

**ప్రభుత్వ అక్రమాలపై కోర్టులను ఆశ్రయిస్తాం**

**బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ప్రభుత్వ అక్రమాలన్నింటి పై కోర్టులను ఆశ్రయిస్తామని తెలిపారు. ఢిల్లీలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ అవినీతి చిట్టా అంతా మా చేతిలోల ఉందని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ల నిలిపివేతతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ల నిలిపివేత, ఎల్ఆర్ఎస్ లోపాలపై ఉద్యమిస్తామని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేల అక్రమాలను, అవినీతిని బయటపెడతామని హెచ్చరించారు. త్వరలో సీఎం కేసీఆర్ అవినీతిపై సాక్ష్యాలతో కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తామని తెలిపారు బండి సంజయ్. కాగా.. ఇటీవల జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో బీజేపీ అద్భుత విజయం సాధించింది. ఈ ఎన్నికల్లో నాలుగు సీట్ల నుంచి ఏకంగా 44 సీట్లకు ఎగబాకింది బీజేపీ పార్టీ. దీంతో టీఆర్ఎస్ పార్టీకి అసలైన పత్రిపక్షమని గ్రేటర్ ఫలితాల ద్వారా బీజేపీ స్పష్టం చేసింది.

# భారతీయ హస్తకళలను ఆదరిద్దాం..!

**(డిసెంబర్ 8 - 14 'అఖిల భారతీయ హస్తకళల వారోత్సవాలు' సందర్భంగా)**

ప్రముఖ సంఘ సంస్కర్త, స్వాతంత్ర పోరాట యోధురాలు, మహాత్మాగాంధీ శిష్యురాలైన స్వర్గీయ శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ భారతీయ చేనేత హస్తకళల పట్ల చూపిన ఆదరణ మరియు అంకితభావాలను గుర్తు చేసుకుంటూ, డిసెంబర్ 8 - 14 వరకు దేశవ్యాప్తంగా "అఖిల భారతీయ హస్తకళల వారోత్సవాలు' పెద్ద ఎత్తున నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది. హస్తకళల పట్ల ఆదరణ, అవగాహన, కళాకారుల ప్రోత్సాహం, ఉత్సాహం మరియు చేయూత ఇవ్వడానికి కావలసిన కార్యక్రమాలను వారోత్సవాల్లో నిర్వహించే ప్రయత్నం చేస్తారు. భారతీయ హస్తకళాఖండాలకు విదేశాల్లో కూడా మంచి గుర్తింపు ఉండడంతో 67,000లకు పైగా ఎగుమతి కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి. మిలియన్ల హస్తకళల శ్రామికవర్గాన్ని ఆదుకొన ఉత్సాహ పరుచుటకు వారు సృష్టించిన ఉత్పత్తులను అందరికి అందుబాటులో ఉండేలా మరియు కొనేలా చర్యలు తీసుకోవాలి. హస్తకళల వారోత్సవాల్లో భాగంగా మహానగరాలు, పట్టణాలు మరియు మండల కేంద్రాలలో ప్రజల సందర్శనార్థం ప్రదర్శనలను నిర్వహించడం మరియు నైపుణ్యం కలిగిన కళాకారులను గుర్తించి సన్మానించడం మంచి ఆచారంగా ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలు స్వీకరించాలి. హస్తకళలకు సంబంధించిన సమస్యలను గుర్తించి పలు పరిష్కార చర్యలుగా మార్కెటింగ్, సాంకేతిక, ఆర్థిక మరియు శిక్షణా కార్యక్రమాలు తీసుకునే సదుద్దేశంతో 1952లో అఖిల భారతీయ హస్తకళల బోర్డ్ ఏర్పాటు చేయబడింది.

భారతదేశంలోని అసంఘటిత హస్తకళల రంగాన్ని అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. పెట్టుబడి లేకపోవడం, ఆధునిక శిక్షణకు దూరంగా ఉండడం, మార్కెటింగ్ వసతులు లేకపోవడం లాంటి సమస్యలు హస్తకళల కళాకారులను పట్టి పీడిస్తున్నాయి. హస్తకళల రంగంలో 7 మిలియన్ల శ్రామికులు పని చేస్తున్నారని, వీరిలో మహిళలు 56 శాతం, పురుషులు 44 శాతం, యస్సిలు 21 శాతం, యస్టీలు 8 శాతం, ఓబిసీలు 52 శాతం ఉన్నారు. హస్తకళల్లో చేనేత వస్త్రాలు, లెదర్, కర్రలు, లోహాలు, బంక మట్టి, ఎముకలు, కొమ్ములు, గాజు, శిల్పాలు, కార్పెట్స్, జరీ వస్తువులు, పేయింటింగ్, నార వస్తువులు, వెదురు, కేక్ డెకరేషన్, కొవ్వత్తులు, పేపర్, వ్యర్థ పదార్థాలు లాంటి వస్తువులను మాధ్యమాలుగా వినియోగిస్తారు. 2019-20 సంవత్సరంలో హస్తకళల ఎగుమతులు 3.35 శాతం తగ్గాయి. గత సంవత్సరం 26,213 కోట్ల రూపాయల విలువైన హస్తకళల వ్యాపారం జరుగగా, 13,412 కోట్ల ఎగుమతులు జరిగాయి. కోవిడ్-19 కల్లోలాన్ని అధిగమించి 2020 - 21 సంవత్సరంలో 24,000 కోట్ల వ్యాపారం జరుగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రపంచ హస్తకళల మార్కెటింగ్‌లో ఇండియా 1.2 శాతం మాత్రమే ఉంది. కర్ర కళలు, ఎంబ్రాయిడరీ, చేనేత వస్త్రాలు, ఇమిటేషన్ ఆభరణాలు మరియు లోహ కళ ఖండాలకు అమెరికా, ఇంగ్లాండ్, యూఏఈ, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, కెనడా, ఆస్ట్రేలియా, నెదర్లాండ్ లాంటి విదేశాల్లో మంచి డిమాండ్ ఉన్నది. భారత దేశం విభిన్న సంస్కృతులు మరియు జీవన వైవిధ్యానికి నెలవుగా ఉన్నందున హస్తకళల్లో అపార విలక్షణత కనిపిస్తున్నది. దేశీయ మార్కెట్‌లో తీవ్రమైన పోటీ, డిమాండ్ సప్లై వ్యత్యాసం, నాణ్యతలో విదేశీ ఉత్పత్తులతో పోటీ, ఈ-కామర్స్ ప్రభంజనాన్ని తట్టుకోక పోవడం, విదేశీ సాంకేతికత అంది పుచ్చుకోక పోవడం లాంటి పలు సమస్యలు మన హస్తకళల శ్రామికులను వెంటాడుతున్నాయి. విదేశీ యంత్ర ఉత్పత్తులకు బదులు మన దేశంలో హస్తకళలు మాత్రమే ఆదరణకు నోచుకుంటున్నాయి. బ్రాండ్ ఇమేజ్ కల్పించడం, క్రాఫ్ట్ ఫెస్టివల్స్ మరియు రోడ్ షోల నిర్వహణ, పబ్లిసిటీ, సుందర ఆకర్షణీయ ప్యాకేజింగ్, ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలతో సమన్వయ పరుచుకోవడం, ఆధునిక సాంకేతిక శిక్షణ ఇవ్వడం, సృజనశీలతను ప్రోత్సహించడం, ప్రధాన కేంద్రాలలో దుకాణాలు తెరవడం లాంటి చర్యలు హస్తకళలకు మంచి రోజులు తెస్తాయి. భారతీయ హస్తకళల కళాకారులను ప్రోత్సహించడానికి వారు తయారు చేసిన ఉత్పత్తులను ఆదరించడం మన కనీస బాధ్యతగా గుర్తించాలి. హస్తకళలు కొన్నపుడు, శ్రామికుని ఇంట్లో నవ్వుల పువ్వులు పూస్తాయని మరువరాదు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# బ్రిటన్‌లో భారీగా వ్యాక్సినేషన్‌కు శ్రీకారం

**నేటి నుండి ప్రజలకు ఇచ్చేందుకు సర్వం సిద్ధం**

బ్రిటన్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): నెలలు గడుస్తున్నా కరోనా విజృంభణ కొనసాగుతూనే ఉంది. దీనికి అంతం లేదా అంటే... వ్యాక్సిన్ మాత్రమే మనముందున్న మార్గమని ఇప్పటికే పలు వైద్య నిపుణులు తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలు వ్యాక్సిన్ కోసం పరుగులు తీస్తున్నాయి... వారి దేశ ప్రజలను సంరక్షించుకోవడానికి వ్యాక్సిన్ అభివృద్ధి పనులను వేగవంతం చేశాయి. కాగా కరోనాను కనుమరుగు చేసేందుకు వ్యాక్సిన్ యుద్ధం మొదలు పెట్టింది బ్రిటన్ ప్రభుత్వం. భారీ వ్యాక్సినేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రెడీగా ఉన్న ఫైజర్ కరోనా వ్యాక్సిన్ ను తమ ప్రజలకు ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. దాదాపుగా 50 జాతీయ ఆసుపత్రులలో వ్యాక్సిన్ ఇచ్చే కార్యక్రమాన్ని ఎటువంటి ఆటంకాలు లేకుండా జరిపేందుకు సన్నాహాలు చేస్తున్నారు అక్కడి అధికారులు. కాకపోతే వ్యాక్సిన్ ఎవరికి ఇస్తారు అన్న విషయంపై ప్రజలు ఆందోళన చెందుతూ ఉండగా... దీనికి స్పందించిన బ్రిటన్ ఆరోగ్య శాఖ కీలక ప్రకటన విడుదల చేసింది. తొలుత ఫ్రంట్ లైన్ వర్కర్లకు, ఇళ్లల్లోనే ఉండే వయో వృద్ధులకు, ముఖ్యంగా 80 ఏళ్ల వయసు పై బడిన వారికి, వారి సంరక్షకులకి మొట్ట మొదట వ్యాక్సిన్ ఇవ్వనున్నట్టుగా మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి మట్ హన్‌కాక్ మాట్లాడుతూ..మంగళవారం నుంచి వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభం కానున్నట్టు స్పష్టం చేశారు. 6.7కోట్ల జనాభా ఉన్న బ్రిటన్ మొదట రెండు కోట్ల మందికి టీకాను ఇవ్వనున్నట్లు పేర్కొంది. దశలవారీగా ఈ వ్యాక్సిన్ ను ఇవ్వబోతున్నామని.... ప్రజలు అన్ని అంశాలను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమానికి సహకరించాలని విన్నవించారు. అదేవిధంగా కరోనా నిబంధనలు పాటించడం తప్పనిసరి అని ఆయన సూచించారు. కరోనా నేపథ్యంలో ..వయసుని దృష్టిలో ఉంచుకొని బ్రిటన్ రాణి ఎలిజెబెత్ (94), ఆమె భర్త ప్రిన్స్ ఫిలిప్ (99)లకు తొలి ప్రాధాన్యంగా టీకా ఇవ్వబోతున్నట్లు ది మెయిల్ పత్రిక ప్రచురించింది. ఆ తర్వాత మిగిలిన ప్రజలకు కరోనా వ్యాక్సిన్ ను ఇవ్వనున్నారు.

# భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి):నేడు మంగళవారం రోజున జరిగే భారత్ బంద్ ను విజయవంతం చేయాలని వేములవాడ టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పులకం రాజు అన్నారు ,సోమవారం వేములవాడ పట్టణంలో ఎమ్మెల్యే గెస్ట్ హౌస్ లోపార్టీ ముఖ్య కార్యకర్తలతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత్ బంద్ నేపథ్యంలో వేములవాడ మండలంలో యావత్తు రైతు సోదరులు, అన్ని వర్తక వాణిజ్య సంస్థలు, హోటల్ యజమానులు, దుకాణాల యజమానులు, అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా సహకరించి ఢిల్లీలో కొట్లాడుతున్న కోట్లాది రైతులకు అండదండగా నిలిచి మంగళవారం భారత్ బంద్ ను విజయవంతం చేసి ఢిల్లీ పాలకుల కళ్లు తెరిపించాలని కోరారు,

ఈ సమావేశంలో సెస్ డైరెక్టర్లు రామతీర్థ పు రాజు ,జడలశ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాన్లు , వైస్ చైర్మన్ మధు రాజేందర్ శర్మ ,కౌన్సిలర్లు బింగిమహేష్ , సిరిగిరి రామ్ చంద్రం, యాచమనేని శ్రీనివాసరావు ,గోలి మహేష్,కోఆప్షన్ మెంబర్ బాబును,టీఆర్ఎస్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, పాలాస నరేందర్ , మహమ్మద్ సలీమ్ , వంగల శ్రీనివాస్ , అన్నారం శ్రీనివాస్ , పిర్ మహమ్మద్ ,దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కరోనా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి..

**కౌన్సిలర్ ముప్పిడి సునంద శ్రీనివాస్**



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి): మహమ్మారి కరోనా వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని 26వార్డు కౌన్సిలర్ ముప్పిడి సునంద శ్రీనివాస్ అన్నారు . సోమవారం వేములవాడ పట్టణంలో 26వ వార్డులో 67 మందికి కరోనా కోవిడ్19 పరీక్షలను నిర్వహించగా ప్రతి ఒక్కరికి నెగటివ్ గా రిపోర్ట్ వచ్చినట్లు కౌన్సిలర్ తెలిపారు, చలికాలంలో కరోన రెండవ దశ విజృంభించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ముందుకు సాగాలన్నారు, ముఖ్యంగా కరోనా సోకకుండా మా స్కులు ధరించాలని, అలాగే భౌతిక దూరాన్ని పాటించాలని, తరచూ చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు, జ్వరం, జలుబు, దగ్గ తదితర లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకోవాల న్నారు,

# తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

**కేసీఆర్‌ను గద్దె దించుతాం**
**కేసీఆర్ అవినీతిని బయటపెడతా**
**ముందు నుంచే నాపై కేసీఆర్ కుట్రపూరితంగా వ్యవహరించారు**
**తెలంగాణలో ఏ పార్టీ ఉండకూడదని కేసీఆర్ దురుద్దేశ్యం**
**బీజేపీలో చేరిన అనంతరం మీడియాతో విజయశాంతి**

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): కాంగ్రెస్‌కు గుడ్ బై చెప్పిన విజయశాంతి అలియాస్ రాములమ్మ కొద్దిసేపటి క్రితం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. ఢిల్లీ వేదికగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. అనంతరం ఢిల్లీలోనే మీడియాతో మాట్లాడిన రాములక్క తన రాజకీయ జీవితం, కాంగ్రెస్ నుంచి ఎందుకు బయటికి రావాల్సి వచ్చింది..? అనే విషయాలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం కేసీఆర్ గురించి మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. '1998 జనవరి-26న బీజేపీలో నా రాజకీయ జీవితం ప్రారంభించాను. తెలంగాణ కోసం చాలా కష్టపడ్డాను. కొన్ని కారణాల వల్ల బీజేపీని వదిలి బయటకు వచ్చాను. 2005 మే నెలలో బయటకు వచ్చి తెలంగాణ లక్ష్యంగా తల్లి తెలంగాణ పార్టీ నెలకొల్పాను. నా రాజకీయ జీతంలో అనేక అంశాలపై పోరాడాను. టీఆర్ఎస్ కోసం ఎవరు ఉండకూడదు.. ఏ పార్టీ ఉండకూడదన్న దురుద్దేశ్యంతో సీఎం కేసీఆర్ వ్యవహరించారు. పార్టీని విలీనం చేయమని నాపై కేసీఆర్ ఒత్తిడి తెచ్చారు. కేసీఆర్ కన్నా నేను ముందుగా తెలంగాణ కోసం పోరాడుతూ వచ్చాను. కేసీఆర్ తన కుటుంబమే ఉద్యమంలో ఉండాలనుకున్నారు. టీఆర్ఎస్ నుంచి ఇద్దరం ఎంపీలుగా గెలిచాం. 2013లో జూలైలో అదే రాత్రి నన్ను సస్పెండ్ చేశారు. ముందు నుంచే నాపై కేసీఆర్ కుట్రపూరితంగా వ్యవహరించారు. నేనే పార్టీ నుంచి బయటకు వెళ్లానని ప్రచారం చేశారు' అని కేసీఆర్‌పై విమర్శల వర్షం కురిపించారు. ' తెలంగాణ ఇస్తే టీఆర్ఎస్ పార్టీని విలీనం చేస్తానని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి చెప్పారు. కానీ చివరికి ఆయన యూటర్న్ తీసుకున్నారు. తెలంగాణలో కొట్లాడే నేతలు ఉండకూడదన్న యోచనలో కేసీఆర్ అందర్నీ ఆ పార్టీలో చేర్చుకున్నారు. కానీ.. ప్రస్తుతం తెలంగాణ టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగింది. కేసీఆర్‌ను గద్దె దించుతాం.. ఆయన అవినీతిని బయటపెడతాను. తెలంగాణలో అత్యధికంగా అవినీతి జరుగుతోంది. రేపు తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే. విజయశాంతి ఎక్కడ ఉన్న కీలక పాత్రే పోషిస్తుంది' అని రాములక్క చెప్పుకొచ్చారు.

# చైనాలో సింగిల్ కిడ్ పాలసీ

**జనాభాను తగ్గించేందుకు కేవలం సింగిల్కిడ్ నిబంధన విధింపు**

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ):? కరోనా వైరస్కు పుట్టినిల్లయిన చైనా ఇప్పుడిప్పుడే వైరస్ నుంచి కోలుకుంటోంది. అయితే, కరోనా వ్యాపించడానికి చైనానే మూల కారణమని ప్రపంచ దేశాలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే, చైనా ఇప్పుడు మరో సంక్షోభాన్ని ఎదుర్కోబోతోందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న చైనా తమ దేశ జనాభాను నియంత్రించే ఉద్దేశ్యంతో రెండు దశాబ్దాల క్రితం సింగిల్ కిడ్ పాలసీని తీసుకొచ్చింది. ఈ పాలసీని రెండు దశాబ్దాల పాటు కఠినంగా అమలు చేసింది. దీంతో చైనాలో వృద్ధ జనాభా పెరిగి, పిల్లలు, యువత సంఖ్య గణనీయంగా పడిపోయింది. దీంతో అక్కడ మానవ వనరుల కొరత ఏర్పడింది. దీన్ని గమనించిన అక్కడి ప్రభుత్వం 2016లో ఆ పాలసీని విరమించుకుంది. అయినప్పటికీ, సింగిల్ కిడ్ పాలసీకి ప్రజలు అలవాటు పడటంతో త్వరలో చైనా మ్యాన్ పవర్ సమస్యను ఎదుర్కొంటుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దీంతో ఒక్కరి కంటే ఎక్కువ మందిని కనాలని చైనా అధికారులు ప్రజలను కోరుతున్నారు. అయినప్పటికీ ప్రజలు వారి విజ్ఞప్తిని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఎందుకంటే చైనా సమాజంలో చోటుచేసుకున్న ఆర్థిక, సామాజిక మార్పుల కారణంగా జీవన వ్యయం భారీగా పెరిగిపోతుంది. దీంతో యువత పెళ్లిళ్లు చేసుకోవడాన్ని, దంపతులు పిల్లల్ని కనడాన్ని వాయిదా వేసుకోవడం ప్రారంభించారు. తద్వారా అక్కడ పునరుత్పత్తి రేటు గణనీయంగా పడిపోయి ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ప్రమాదకర స్థాయికి పడిపోయిన పునరుత్పత్తి రేటు.. అయితే, చైనా జనాభా దృష్ట్యా పునరుత్పత్తి రేటు 2.1గా ఉండాలని, ఇది 1.5 కంటే దిగువకు చేరుకుంటే ప్రమాదం ముంచుకొస్తున్నట్లే అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల, వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని వారు చైనా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కాగా, 10 సంవత్సరాల క్రితం నిర్వహించిన చివరి జనాభా లెక్కల ప్రకారం చైనా జనాభా 1.37 బిలియన్లుగా నమోదైంది. నేషనల్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రకారం చైనాలో జనన రేటు గత సంవత్సరం నాటికి గణనీయంగా తగ్గింది. అక్కడ ప్రతి 1,000 మందికి 10.48 మంది జనాభా తగ్గారు. దీంతో మొత్తం జననాల సంఖ్య కూడా 5,80,000 మేర తగ్గింది. గత ఏడు దశాబ్దాలతో పోలిస్తే ఇంత తక్కువ స్థాయిలో జనాభా వృద్ధిరేటు నమోదు కావడం ఇదే ప్రథమం అని నిపుణులు పేర్కొంటున్నారు. గణాంకాల ప్రకారం చైనాలో 60 ఏళ్లకు పైబడిన జనాభా 420 మిలియన్లకు పెరిగిందని, దీంతో నర్సింగ్ సేవలు, డేకేర్ కేంద్రాలపై తీవ్ర ఒత్తిడి పెరిగుతోందని అక్కడి అధికారులు చెబుతున్నారు. సింగిల్ చైల్ పాలసీతో 400 మిలియన్ల శ్రామిక- వయస్సు గల వ్యక్తులను చైనా కోల్పోతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# నేడు జరగాల్సిన జేఎన్టీయూ,ఓయూ పరీక్షలు వాయిదా

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): భారత్ బంద్ కారణంగా జేఎన్టీయూ పరిధిలో రేపు జరగాల్సిన సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేశారు. నేడు జరగాల్సిన పరీక్షలను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసినట్లు జేఎన్టీయూ అధికారులు తెలిపారు. 8న జరగాల్సిన పీజీ ఉమ్మడి ప్రవేశ పరీక్షలను రద్దు చేసినట్లు కన్వీనర్ కిషన్ వెల్లడించారు. వాయిదా పడ్డ ప్రవేశ పరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని చెప్పారు.

## ఓయూ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో మంగళవారం నిర్వహించనున్న అన్ని పరీక్షలు వాయిదా వేసినట్లు యూనివర్సిటీ తెలిపింది. భారత్ బంద్ నేపథ్యంలో పరీక్షలను వాయిదా వేసినట్లు పేర్కొంది. ఈ నెల 9న జరిగే పరీక్షలన్నీ యథాతధంగా కొనసాగుతాయని వర్సిటీ తెలిపింది. వాయిదా పడిన పరీక్షల తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తూ రైతులు మంగళవారం భారత్‌బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తుగా వర్సిటీ పరీక్షలను వాయిదా వేసింది.

# కొత్త వ్యవసాయ చట్టాల్ని వెంటనే రద్దు చేయాలి

**అవి అంబానీ-అదానీల చట్టాలు**
**కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్**

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): దేశరాజధానిలో ఆందోళన చేస్తున్న రైతులకు వివిధ పార్టీల నాయకులు అండగా నిలుస్తున్నారు. కొత్త వ్యవసాయ చట్టాల్ని అంబానీ-అదానీ చట్టాలుగా అభివర్ణించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతకు మించి ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదనని ముందుకు తెచ్చినా అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. మరోవైపు రైతుల డిమాండ్లకు తాము పూర్తిగా మద్దతిస్తున్నామని దిల్లీ సీఎం కేజ్రీవాల్ ప్రకటించారు. అన్నదాతలు ఆందోళన చేపట్టిన తొలిరోజు నుంచి తమ ఆమ్ ఆద్మీ పార్టీ వారికి అండగా నిలబడిందన్నారు. నిరసన ప్రారంభమైన తొలి రోజుల్లో నగరంలోని తొమ్మిది మైదానాలను జైళ్లుగా మార్చేందుకు దిల్లీ పోలీసులు అనుమతి కోరారని గుర్తుచేశారు.

ఢిల్లీ సరిహద్దులకు సీఎం కేజ్రీవాల్

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు కొత్త వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా రైతులు చేస్తున్న పోరాటం ఉధృతమైంది. అన్నదాతలు 10 రోజులుగా ఢిల్లీ సరిహద్దులో ఉన్నారు. కేంద్రం బిల్లులు ఉపసంహరించుకునే వరకు వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెబుతున్నారు. రైతుల పోరాటనికి మద్దతు కూడా పెరుగుతోంది. ఢిల్లీ సమీపంలోని రాష్ట్రాల నుంచి వేలాదిగా రైతులు తరలివస్తున్నారు. ఢిల్లీ సరిహద్దు ప్రాంతాలైన సింఘు, టిక్రీ ప్రాంతాల్లో వేలాదిగా చేరిన రైతులు, తమను ఢిల్లీలోకి అనుమతించాలని నిరసనలు కొనసాగిస్తున్నారు. సింఘుతో పాటు టిక్రీ, ఘాజీపూర్ లో సైతం రైతుల ఆందోళన కొనసాగుతోంది.మంగళవారం రైతులు చేపట్టనున్న భారత్ బంద్ కు అన్ని వర్గాల నుంచి సపోర్ట్ లభిస్తోంది. రైతుల బంద్ పిలుపుతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఢిల్లీ సరిహద్దులో భారీగా అదనపు బలగాలను మోహరిస్తోంది. దేశ రాజధాని సరిహద్దుల్లో నిరసనలు తెలియజేస్తున్న రైతులకు సంఘీభావం తెలపాలని నిర్ణయించుకున్నారు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్. తన సహచర మంత్రులతో కలిసి ఆయన హర్యానా - ఢిల్లీ బార్డర్ కు వెళ్లనున్నారు. రైతులకు అక్కడ కల్పిస్తున్న ఏర్పాట్లను కేజ్రీవాల్ స్వయంగా సమీక్షించనున్నారు. రైతుల నిరసనలు 10వ రోజుకు చేరుకోగా, వారిని పరామర్శించేందుకు వెళుతున్న తొలి సీఎంగా కేజ్రీవాల్ నిలవనున్నారు. ఢిల్లీ-హర్యానా సరిహద్దులో రైతుల కోసం ఢిల్లీ ప్రభుత్వం ఇప్పటికే సౌకర్యాలను కల్పించిందని వ్యాఖ్యానించిన కేజ్రీవాల్, "8న జరిగే భారత్ బంద్ కు ఆమ్ ఆద్మీ పార్టీ పూర్తిగా మద్దతిస్తోంది తెలిపారు. రైతులు తెలియజేస్తున్న నిరసనలకు ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని కోరుతున్నాను" అని కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

# భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

**రైతు సంఘాలకు కాంగ్రెస్ పార్టీ మద్దతు - ఆది శ్రీనివాస్**



రాజన్న సిరిసిల్లా, డిసెంబర్ 7 (నేటినిజం ప్రతినిధి): దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం తెచ్చినటువంటి రైతు వ్యతిరేక విధానాలు బిల్లులకు నిరసనగా ఢిల్లీలో జరుగుతున్నటువంటి కార్యక్రమం కి రైతులకు మద్దతుగా దేశవ్యాప్తంగా ఈనెల 8 వ తారీకు బంద్ కు పిలుపునివ్వడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆది శ్రీనివాస్ అన్నారు . దానిలో భాగంగా ఏఐసిసి కూడ ప్రతి జిల్లాలో , ప్రతి గ్రామంలో రైతులకు మద్దతుగా 8 న భారత్ బంద్ ను విజయవంతం చేసే అంశంలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పాల్గొనాలని పిలుపునిచ్చారు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఢిల్లీలో జరుగుతున్న ఉద్యమానికి , తెలంగాణలో ఉన్న రైతుల సమస్యలకు నిరసనగా ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 8 న భారత్ బంద్ లో చురుకుగా పాల్గొని కాంగ్రెస్ పార్టీ జెండా ఎగర వేసి , ఈ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన రైతు వ్యతిరేక బిల్లులు ఉపసంహరించుకునే వరకు పోరాటం చేయాలని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పక్షాన విజ్ఞప్తి చేస్తున్నామన్నారు

# చలికాలంతో సెకండ్‌వేవ్‌కు ఛాన్స్

**శుభకార్యాలతో విచ్చలవిడిగా తిరగరాదు**
**అప్రమత్తంగా ఉండాలన్న ప్రజారోగ్య శాఖ**

న్యూఢిల్లీ,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): శీతకాలంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. కరోనాకు వ్యాక్సిన్ వచ్చినా ఇంకా దాని విజృంభణ ఆగలేదని, అందువల్ల శీతాకాలంలో మరింత అప్రమత్తత అవసరమని అంటున్నారు. వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ శ్రీనివాస రావు కూడా ఇప్పటికే ఇదే సూచన చేశారు. ఇకపోతే ఆయా జిల్లాల వైద్యాధికారులు కూడా ప్రజలు ఇలాగే హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం చలి తీవ్రత ఎక్కువగా ఉందని, కరోనా వైరస్ వ్యాప్తి పెరిగే అవకాశం ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు కొవిడ్ నిబంధనలు పాటించాలని సూచించారు. కరోనా లక్షణాలు ఉంటే నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు.ప్రతీ గ్రామంలో కరోనా నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పుడు సెకండ్ వేవ్ రూపంలో మరోసారి కరోనా విపత్తు ప్రపంచాన్ని భయాందోళనకు గురిచేస్తున్నది. ప్రస్తుతం మన రాష్ట్రంలో వైరస్ వ్యాప్తి అదుపులోనే ఉన్నా... కొన్నాళ్లుగా పాజిటివిటీ రేటు.. కొత్త కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. కాగా, ఇప్పటికే దేశరాజధాని ఢిల్లీతోపాటు కొన్ని ప్రాంతాల్లో సెకండ్ వేవ్ జాడలు కనిపిస్తున్నాయి. మనం అప్రమత్తంగా ఉంటే ఆ ప్రమాదాన్ని తప్పించుకోవచ్చు. ఏ మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించినా మరోసారి కల్లోలంలో పడగలమని అంటున్నారు. కరోనా జాగ్రత్తలు పాటిస్తే తప్పించుకోవడం మన చేతుల్లోనే ఉన్నదని వైద్యాధికారులు చెప్తున్నారు. చలికాలం నేపథ్యంలో రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు తగ్గాయి. చలి తీవ్రత పెరిగింది. కరోనా వేగంగా వ్యాప్తి చెందడానికి ఇలాంటి వాతావరణం ఎంతో అనుకూలం. అందుకే బ్రిటన్ వంటి దేశాల్లో సెకండ్ వేవ్ మొదలైంది. ఇప్పటికే ఐరోపా ఖండాన్ని సెకండ్ వేవ్ అతలాకుతలం చేస్తున్నది. దాయాది దేశం పాకిస్థాన్‌ను సైతం ఆగం చేస్తున్నది. వైరస్ కాస్త తగ్గుముఖం పట్టగానే ప్రజలు కనీస జాగ్రత్తలు పాటించకుండా వీకెండ్ ట్రిప్‌లు, హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లకు ఎగబడటం, విం దులు, వినోదాలకు భారీ సంఖ్యలో హాజరవడంతోనే ఇలాంటి పరిస్థితి ఎదురైందని ఆయా దేశాల ప్రభుత్వాలు ఒప్పుకొంటున్నాయి. మన దేశంలోనూ ఢిల్లీలో ఇప్పటికే సెకండ్ వేవ్ జాడలు మొదలయ్యాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోనూ ఆ ఛాయలు కనిపిస్తున్నాయి. కర్ణాటకలో జనవరిలో సెకండ్ వేవ్ వస్తుందని అంచనా వేస్తున్నారు. తెలంగాణ ప్రజలు భయపడాల్సిన పనిలేదని, రాష్ట్రంలో వైరస్ పూర్తిస్థాయిలో అదుపులో ఉన్నదని అధికారులు చెప్తున్నారు. అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల వేళ ప్రజలు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. దుకాణాలు, మాల్స్ వంటి ప్రాంతాల్లోనూ, పెండ్లిళ్లు వంటి శుభకార్యాల్లోనూ కాస్త నిర్లక్ష్యం కనిపిస్తున్నట్టు పేర్కొన్నారు. అప్రమత్తంగా ఉంటే సెకండ్ వేవ్ ముప్పును తప్పించుకోవచ్చని చెప్పారు. లేదంటే భారీ నష్టం తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మాస్కులు ధరించడం, శానిటైజర్లు వాడటం, భౌతికదూరం పాటించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తిచేస్తున్నారు. ఇకపోతే ప్రభుత్వ పటిష్ఠ చర్యలకుతోడు ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించడంతో ఆయా రాష్ట్రాల్లో కరోనా తగ్గుముఖం పట్టింది. కొత్త కేసుల సంఖ్య గతనెలతో పోల్చితే సగానికి పడిపోయింది. పాజిటివిటీ రేటు కూడా భారీగా తగ్గింది. కరోనా వ్యాప్తి మొదలైన రోజుల్లో పాజిటివిటీ రేటు ఎక్కువగా ఉండేది. ప్రభుత్వం భారీ సంఖ్యలో పరీక్షలు నిర్వహించడం, వైరస్ సోకినవారికి మెరుగైన చికిత్స అందించడం, ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించి మాస్కులు, శానిటైజర్లు, భౌతికదూరం పాటించడంతో కరోనా వ్యాప్తి క్రమంగా తగ్గుముఖం పట్టింది. తెలంగాణ రాష్ట్రంలో రోజువారీ కరోనా టెస్టుల సంఖ్య 60 వేలకు చేరువైంది. శుక్రవారం ఒక్కరోజే రికార్డుస్థాయిలో 59,471 పరీక్షలు నిర్వహించారు. గురువారంతో పోల్చితే రెండు వేలు అదనంగా చేశారు. దీంతో మొత్తం పరీక్షల సంఖ్య 57 లక్షలు దాటింది. కొత్తగా 596 వైరస్ పాజిటివ్ కేసులు నమోదైనట్టు శనివారం విడుదలచేసిన బులెటిన్‌లో వైద్యారోగ్యశాఖ పేర్కొన్నది. అత్యధికంగా జీహెచ్ఎంసీలో 102, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 47, రంగారెడ్డిలో 46, కరీంనగర్‌లో 36 కేసులు వెలుగుచూశాయి. రాష్ట్రంలో రికవరీ రేటు 96.34 శాతానికి చేరుకున్నది. దేశవ్యాప్తంగా రేటు 94.3 శాతంగా రికార్డయ్యింది. ఈ కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కేంద్ర వైద్యారోగ్య శాఖ కూడా హెచ్చరిస్తోంది.

# కరోనాతో టీవీ నటి మృతి

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ): దివ్య భట్నాగర్.. యే రిష్తా క్యా కెహ్లాతా హై, తేరా యార్ హూన్ మెయిన్ షోలలో నటించి పాపులర్ అయినా నటి కరోనాతో పోరాడి మరణించింది. దివ్య భట్నాగర్ మృతిపట్ల నటులు దేవోలీనా భట్టాచార్జీ, శిల్పా శిరోడ్కర్ సోషల్ మీడియాలో తమ సంతాపాన్ని తెలిపారు. కరోనాతో పోరాడుతున్న దివ్య ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో పాటు ఆమె శరీరంలో ఆక్సిజన్ స్థాయి గణనీయంగా పడిపోయిది. దీంతో వైద్యులు ఆమెను వెంటిలేటర్‌పై కూడా ఉంచారు. ఇక దివ్య భట్నాగర్.. ఆరోగ్య పరిస్థితిని చూసి.. ఆమె సహనటులు కొందరు, తేరా యార్ హూన్ మెయిన్ సీరియల్ ప్రొడక్షన్ హౌస్ కూడా ఆర్థికంగా సహాయం చేయడానికి ముందుకు వచ్చారు. కానీ, కరోనాతో పోరాడి పోరాడి ఆరోగ్యం క్షీణించడంతో పరిస్థితి విషమించి కన్నుమూశారు. ఇక ఆమె భర్త గగన్ కూడా దివ్యకు కరోనా సోకిందని తెలియడంతో ఆమెను వదిలివెళ్లినట్లు తెలుస్తోంది. దివ్య, గగన్‌ను ప్రేమించి 2019 డిసెంబర్‌లో తన కుటుంబానికి తెలియజేయకుండా వివాహం చేసుకుంది. దివ్యకు కరోనా సోకడంతో తాను విడిచిపెట్టి, పరారీలో ఉన్నాననే వాదనలను గగన్ తిరస్కరించాడు. దివ్య భట్నాగర్.. ఉడాన్, జీత్ గయి తోహ్ పియా మోర్రే, విష్ వంటి షోల్లో నటించింది. ఇటీవల తెలుగు సీనియర్ నటుడు రాజశేఖర్ కూడా కొద్ది రోజులు కరోనాతో పోరాడి గెలిచి ఆరోగ్యంగా బయటకు వచ్చాడు. అటు బాలీవుడ్‌లో కూడా బిగ్ బీ అమితాబ్ బచ్చన్ కరోనాతో పోరాడి గెలిచి ఆరోగ్యంగా ఇంటికి వచ్చాడు. ఇక కరోనా కారణంగా ఇటు తెలుగులో కూడా కొందరు ప్రముఖులు మరణించిన సంగతి తెలిసిందే. ప్రముఖ సింగర్ బాలు కరోనాతో పోరాడి.. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మరణించారు.

# దేశంలోని ఏటీఎంల అంతరాన్ని ఏఈపీఎస్, మైక్రో ఏటీఎం సేవలతో భర్తీ

హైదరాబాద్,డిసెంబర్7: దేశంలో ఆర్థిక చేరికను మరింత లోతుగా నడిపించే ప్రయత్నంతో రాపిపే ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఇటీవల ఒక దేశ వ్యాప్త ఆఫర్‌ను ప్రారంభించిందని రాపిపే సీఈవో యోగేంద్ర కశ్యప్ తెలిపారు. రాపిపే తన ఏజెంట్లకు ఏఈపీఎస్ సేవలపై అత్యధిక కమీషన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆఫర్ జనవరి 21వ తేదీ వరకూ వర్తిస్తోందన్నారు. రాపిపే ఆధార్ కార్డుతో నగదు ఉపసంహరణ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా సమాజంలోని అన్ని విభాగాలకు అధికారం ఇస్తోందన్నారు. అత్యంత సురక్షితమైన, స్నేహపూర్వక వ్యవస్థ ద్వారా డబ్బును ఉపసంహరించుకోవచ్చు, చెల్లింపులు చేయవచ్చన్నారు. ఎప్పుడైనా ఎక్కడైనా రాపిపేసాథిస్ ద్వారా ఖాతా స్టేట్‌మెంట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. రాపిపే ఏఈపీఎస్ వినియోగదారులకు బ్యాంకింగ్ సేవలను సులభతరం చేస్తోందన్నారు. ఏజెంట్లకు ఉత్తమ కమీషన్ అందిస్తోందన్నారు. ప్రతి లావాదేవీకి రూ.3 చొప్పున ఇంక్రిమెంటల్ కమీషన్ ఇవ్వనుందన్నారు. ఇది ఆధార్ ఏటీఎం పరిశ్రమలో అత్యధికమన్నారు. ఈపిఎస్ సేవలకు అందిస్తున్న పెరుగుతున్న ప్రోత్సాహకం మా ఏజెంట్లకు మాత్రమే కాకుండా తుది వినియోగదారులకు కూడా భారీ ప్రభావాన్ని సృష్టించే ఒక సువర్ణావకాశం అన్నారు. ఈ పథకం కింద కోటికి పైగా ఏఈపీఎస్ లావాదేవీలు సులభతరం అవుతాయని భావిస్తున్నామని తెలిపారు. కోటి పైగా వినియోగదారులు సంప్రదాయ ఏటీఎం లేదా బ్యాంక్ బ్రాంచ్‌పై ఆధారపడకుండా నగదును సులభంగా ఉపసంహరించునే అవకాశం ఉంటుందన్నారు. కోవిడ్ కాలంలో ఏటీఎం ఉపసంహరణలు సగానికి తగ్గించబడ్డాయన్నారు. ఏఈపీఎస్ లావాదేవీలు 153 శాతం పెరిగాయయని తెలిపారు. దేశంలోని అంతర్గత ప్రాంతాల్లో తక్కువ, చాలా దూరం ఏటీఎంలు ఉండటంతో ఏటీపీఎస్, మైక్రో ఏటీఎం కోసం డిమాండ్ పెరిగిందన్నారు. ఈఎన్ఎస్, మైక్రో ఏటీఎం సేవలు మిలియన్ల మంది వినియోగదారులకు జన ధన్ యోజన, పీఎమ్ - కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధాన్ మంత్రి గారిబ్ కళ్యాణ్ స్కీమ్ ఇంకా అనేక ప్రయోజనాల నుంచి నగదు ఉపసంహరించుకునేందుకు వీలు కల్పించాయన్నారు. ఫైనాన్షియల్ చేరికను సాధించాలనే జాతీయ లక్ష్యం కోసం దోహదపడాలనే తపనతో, రాపిపే బ్యాంకింగ్, ఆర్థిక లావాదేవీలను (దేశీయ డబ్బు బదిలీ, ఈఇపిఎస్, మైక్రో ఎటిఎం, మొదలైనవి) వినియోగదారులకు చేరుకోవాలన్నారు.

# 'బోలో హా' తో ప్రేమించడానికి అవును అని చెప్పండి

హైదరాబాద్,డిసెంబర్7 అత్యంత అపూర్వమైన సంవత్సరానికి వేలం వేసిన ధనరాజ్‌గిర్ ప్రొడక్షన్స్ ఈ రోజు తన తొలి వెంచర్ అయిన 'బోలో హా' - హైదరాబాద్ తడ్కాతో ఏక్ మజేదార్ లవ్ స్టోరీని రంగురంగుల శక్తివంతమైన మోషన్ పోస్టర్‌తో విడుదల చేసినట్లు ప్రకటించింది. తరుణ్ ధనరాజ్‌గిర్ దర్శకత్వం వహించిన బోలో హా ప్రేక్షకులకు హైదరాబాద్ చమత్కారమైన మనోజ్ఞతను ఇస్తానని హామీ ఇచ్చారు. 2021 జనవరిలో థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రం అద్నాన్ సాజిద్ ఖాన్ మరియు ప్రీతి నిగం సహకరించి ప్రధాన పాత్రలలో అంకిత్ రతితో జహ్నవి ధనరాజ్గిర్ ను పరిచయం చేసింది.

బోలో హా పురాతన వస్తువులలో ఒక చిన్న టైమ్ డీలర్ కుమారుడు మరియు నవాబుల కుటుంబంలో జన్మించిన రుఖ్సర్, ఇప్పుడు క్లిష్ట ఆర్థిక పరిస్థితిలో, ఒక సాధారణ స్నేహితుడి వివాహంలో కలుసుకుని, ఒకరినొకరు ప్రేమలో పడే కథను వివరించాడు. తేలికపాటి పరిహాసంతో రొమాంటిక్ కామెడీగా నిలిచేది ఏమిటంటే, సజావుగా ఒక నాటకీయ క్లైమాక్స్‌గా ముగుస్తుంది. ఈ చిత్రం శ్రావ్యమైన సంగీతం, హృదయ స్పర్శ ప్రేమ, పక్కటెముక-చక్కిలిగింత హాస్యం మరియు తీవ్రమైన నాటకాలతో నిండిన సంపూర్ణ ఫ్యామిలీ ఎంటర్టైనర్ అని హామీ ఇచ్చింది.

ఆవిష్కరణలో దర్శకుడు తరుణ్ ధనరాజ్‌గిర్ మాట్లాడుతూ, "ఈ కాలంలో థియేట్రికల్ రిలీజ్ కోసం పట్టుబట్టడం నాకు పిచ్చి అని ప్రజలు అనుకుంటున్నారు. కానీ థియేటర్ అనుభవం యొక్క మాయాజాలంతో సరిపోయేది ఏమీ లేదని నేను నమ్ముతున్నాను. ఏ శైలి అయినా. మా చిత్రం రోమ్-కామ్, ఫ్యామిలీ ఎంటర్టైనర్, పెద్ద యాక్షన్ సన్నివేశాలు లేకుండా, పెద్ద స్క్రీన్ కోసం రూపొందించబడింది. 'బోలో హా' అనేది గుండె నుండి నేరుగా సరళమైన తీపి కథ. తాజా ముఖాలు, ఆసక్తికరమైన కథాంశం, తగినంత నాటకం మరియు హాస్యం కలిగిన ఆరోగ్యకరమైన కుటుంబ వినోదం. ఇది మిమ్మల్ని చిరునవ్వుతో వదిలివేస్తుంది. ప్రతి ఒక్కరూ సినిమాను మనలాగే ప్రేమిస్తారని నేను నమ్ముతున్నాను. "

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.